ESTD : 1999
# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
## స్టేట్ విజన్
STATE VISION
శనివారం 1-08-2026 పేజీలు : 16



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారిని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి తన కుమార్తె వివాహానికి ఆహ్వానించిన జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంత రావు.

## సిబియల్ పరిశ్రమ కాంట్రాక్ట్ కార్మికులకు రెగ్యులర్ పని దినాలు కల్పించాలి



- అర్ధాంతరంగా ఉత్పత్తి ఆపేస్తే కార్మికుల బ్రతుకుతెరువెట్లా?
- పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన... అధికారులు స్పందించి న్యాయం చేయాలి
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

చౌటకూర్ జూలై 31 (విజన్ ఆంధ్ర) : చౌటకూర్ మండలం శివంపేట గ్రామ పరిధిలోని 'సిబియల్' (జదీూ) పరిశ్రమలో గడిచిన కొన్నేళ్లుగా వందలాది మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. అయితే పరిశ్రమ యాజమాన్యం అర్ధాంతరంగా ఉత్పత్తులను నిలిపివేయడంతో కార్మికులంతా రోడ్డున పడ్డారని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు ఆవేదన వ్యక్తం చేశారు. 11 లో...

# తెలంగాణకు రండి.. పెట్టుబడులు పెట్టండి..



- పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పిస్తున్నాం
- ఫార్చున్ 500 కంపెనీలు ఫ్యూచర్ సిటీకి రావాలనేదే లక్ష్యం
- రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ లేదు...
- సీఐఐ ఉత్తర భారత ప్రతినిధుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్: వివిధ రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ సురక్షిత స్థానమని, తెలంగాణకు వచ్చి పెట్టుబడులు పెట్టాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఉత్తర భారత ప్రతినిధులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం పెట్టుబడులకు రక్షణగా నిలుస్తుందని సీఎం హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో సీఐఐ ఉత్తర భారత ప్రతినిధులు శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. 14 పేజీలో...



## మల్కాజిగిరిలో మరిన్ని ఓవర్ బ్రిడ్జులు, అండర్ బ్రిడ్జులు నిర్మించాలి

- కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఈటల రాజేందర్ వినతి

4 పేజీలో...

## పెంట్లవెల్లి లో ఆర్ఎంపీ డాక్టర్ మల్లయ్య దారుణ హత్య!



- తన ఆసుపత్రి లో కళ్ళలో కారం చల్లి మారనాయుధాలతో వేటాడి ,వెంటాడి నరికినా గుర్తుతెలియని దుండగులు?
- మా ఆయనను భూతగాదాల వల్లే నరికి చంపారు అన్న మృతుడి ఆర్ఎంపీ డాక్టర్ మల్లయ్య భార్య
- పెంట్లవెల్లి మండల కేంద్రంలో రోజురోజుకు లాండ్ ఆర్డర్ తప్పుతుంది అంటున్న స్థానికులు

కొల్లాపూర్ జూలై 31 : (విజన్ ఆంధ్ర) : నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో 2 పేజీలో...

# అంతర్రాష్ట్ర గృహ చోరీ ముఠా అరెస్ట్




- వరుస గృహచోరీలకు పాల్పడిన నిందితులు
- గృహచోరీ కేసును ఛేదించిన ఏన్కూరు పోలీసులు

ఏన్కూరు, జూలై 31: ఖమ్మం జిల్లా ఏన్కూరు పోలీస్ స్టేషన్‌లో గత ఏడాది జూన్ లో నమోదైన క్రైమ్ నెం. 104/2025 గృహచోరీ కేసును ఏన్కూరు పోలీసులు ఛేదించారు. ఈ కేసులో జల్లేపల్లి వెంకటేశ్వరరావు అలియాస్ వెంకీ, గాదె నాగరాజులను అరెస్ట్ చేసి విచారించగా, సాంకేతిక ఆధారాలు, దర్యాప్తులో సేకరించిన ఇతర ఆధారాల ద్వారా అంతర్రాష్ట్ర గృహచోరీ ముఠా కార్యకలాపాలు వెలుగులోకి వచ్చాయి. 8 పేజీలో...

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల వొడితల సతీష్ కుమార్ దిగ్భ్రాంతి



అక్కన్నపేట విజన్ ఆంధ్ర జులై 31 : గొప్ప ప్రజా నాయకుడిని కోల్పోయామని మాజీ ఎమ్మెల్యే పెద్ది మరణం తెలంగాణ ఉద్యమానికి తీరని లోటని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే శ్రీ వొడితల సతీష్ కుమార్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా టీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెద్ది సుదర్శన్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన ధీశాలి నాయకుడని, ఉద్యమ స్ఫూర్తిని గ్రామీణ స్థాయి వరకు తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారన్నారు. ప్రజల కోసం, తెలంగాణ కోసం ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. అనారోగ్యంతో ఆయన మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ, తనతో ఉన్న సుదీర్ఘ రాజకీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పోషించిన పాత్రను ఎన్నటికీ మరువలేమని అన్నారు. ప్రజా జీవితంలో నిబద్ధత, నిరాడంబరత, ఉద్యమ పట్ల అంకితభావంతో పనిచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, అనుచరులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పెద్ది ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని వొడితల సతీష్ కుమార్ అన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది మృతిపై మంత్రి పొన్నం సంతాపం



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 31 : నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా జీవితంలో పెద్ది సుదర్శన్ రెడ్డి అందించిన సేవలను మంత్రి స్మరించుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా ఆయన గుర్తుండిపోతారని పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం ప్రజా జీవితానికి తీరని లోటని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

# దారుణ హత్య!

గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ మల్లయ్య దారుణ హత్యకు గురయ్యాడు. పక్క పథకం ప్రకారం ముందే వేసుకున్న ప్లాన్ తో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆర్.ఎం.పి డాక్టర్ మల్లయ్య ఆసుపత్రి వద్దకు వచ్చి కళ్ళలో కారం చల్లి మారనాయుధాలతో గొంతు తల భాగంపై విచక్షణారహితంగా నరికి శవాన్ని ప్రధాన మెయిన్ రోడ్డు పై పడేసి పరారయ్యారని మృతుడి భార్య రోదిస్తూ వివరాలను వెల్లడించింది. హత్యకు జరిగిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది, ఈ హత్యకు సంబంధించి పోలీసులు విచారణ వేగవంతం చేశారు శవాన్ని పంచనామా నిమిత్తం కొల్లాపూర్ ఆసుపత్రికి తరలించారు. అయితే పెంట్లవెల్లి మండలంలో లాండ్ ఆర్డర్ తప్పుతుందని స్థానికులు భయాందోళనలకు గురవుతూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రొటెంత వాగు ప్రమాద ఘంటికలు

- ముందే ఊహించిన విజన్ ఆంధ్ర
- పుసుగుప్ప రహదారిపై భారీ వాహనాల రాకపోకలు బంద్ !

చర్ల, (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిధిలోని పుసుగుప్ప ప్రజలకు రవాణా కష్టాలు మొదలయ్యాయి, పుసుగుప్పకు వెళ్లే రహదారిలో ఉన్న రొటంత వాగు వద్ద ఇటీవల నూతనంగా నిర్మించిన బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు, ఇటీవలి భారీ వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిన్నది, వంతెనకు అనుసంధానంగా ఉన్న రోడ్డు కోతకు గురికావడంతో ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ విపత్కర పరిస్థితిపై స్పందించిన చర్ల సీఐ రాజు వర్మ గురువారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు, రోడ్డు దెబ్బతిన్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ఆ రహదారిపై అన్ని రకాల భారీ వాహనాల రాకపోకలను తక్షణమే నిషేధిస్తున్నట్లు తెలిపారు, తదుపరి ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడే వరకు ఈ నిషేధం కఠినంగా అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు, ప్రయాణికులు మరియు వాహనదారులు అప్రమత్తంగా ఉండి, అత్యంత జాగ్రత్తలు పాటించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.



ముందే పసిగట్టిన విజన్ ఆంధ్ర రొటెంత వాగు రహదారి మార్గం ప్రమాదకరంగా మారుతుందని, రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే ముప్పు పొంచి ఉందని విజన్ ఆంధ్ర మీడియా సంస్థ ముందే ఊహించి, ఈ విషయాన్ని ముందుగానే ఎంతో బాధ్యతతో పసిగట్టి హెచ్చరించింది, విజన్ ఆంధ్ర అంచనా వేసినట్లే నేడు ఆ రహదారి దెబ్బతిని రాకపోకలు నిలిచిపోవడం గమనార్హం.

# గోదావరి వరద ఉధృతితో ఏజెన్సీలో నిలిచిన రాకపోకలు

**చర్ల వెంకటాపురం ప్రధాన రహదారిపైకి చేరిన వరద నీరు**

**భద్రాచలం వద్ద నేడు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం**

చర్ల, (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా) : భద్రాచలం వద్ద గోదావరి నది క్రమంగా పెరుగుతున్న వరద ఉధృతితో ఏజెన్సీ ప్రాంతాలలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎనుగుల వాగు ఉప్పొంగడంతో పాటు గోదావరి వరద నీరు ప్రధాన రహదారి పైకి చేరడంతో చర్ల వెంకటాపురం మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి, దీనితో ప్రయాణికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, ఎక్కడికక్కడ వాహనాలను నిలిపివేసి అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.

ప్రమాద హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమైంది, లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు, ఎలాంటి ప్రాణ



నష్టం జరగకుండా అధికారులు అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు, వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్నందున మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్లవద్దని కఠినంగా ఆదేశించారు, రెవెన్యూ ,పోలీస్ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు

# లక్ష్మీనగర్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీకి కొలన్ హన్మంత్ రెడ్డి శుభాకాంక్షలు

- కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ కార్యాలయంలో మర్యాదపూర్వక భేటీ
- నూతన కమిటీ సభ్యులకు శాలువాతో ఘన సత్కారం
- కాలనీ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపు
- ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచన
- ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా సేవలందించాలని ఆకాంక్ష
- పలువురు నాయకులు, కాలనీ వాసుల సమక్షంలో ఆత్మీయ సమావేశం

బాచుపల్లి, జూలై 31 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం లక్ష్మీనగర్ ఓనర్స్ అసోసియేషన్కు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు అమృత్ రెడ్డి, జనరల్ సెక్రటరీ శంకర్ రావు, ట్రెజరర్ సాయి ప్రేమ్ శుక్రవారం బాచుపల్లిలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి నూతన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధి,



మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంలో నూతన కమిటీ సమిష్టిగా కృషి చేసి ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజా సేవే ప్రధాన లక్ష్యంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పాల కృష్ణ, మైసిగారి శ్రీనివాస్‌తో పాటు కాలనీ వాసులు యూ. ప్రభులింగం, ఈ. సురేష్, బి. శ్రీనివాస్, నవీన్, కామేశ్వరరావు, ప్రసాద్ రెడ్డి, రాధిక, త్రివేణి తదితరులు పాల్గొన్నారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ కాలనీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని వారు పేర్కొన్నారు.

# మారు మూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

## - మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుశిధిలావస్థలో మహదేవ పూర్ సామాజిక ఆసుపత్రిని పునర్నిర్మిస్తాం

## - ఆగస్టు 4న ఎంఎన్‌జే ఆసుపత్రి ఆధ్వర్యంలో మరో ఆరోగ్య శిబిరం

భూపాలపల్లి జిల్లా జులై 31 (విజన్ ఆంధ్ర) మారు మూల ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మహదేవపూర్ సామాజిక ఆసుపత్రిలో ఐడిబిఐ సహకారంతో ఎంఎన్జె ఆసుపత్రి హైదరాబాద్, ఒమెగా ఆసుపత్రి కరీంనగర్ వైద్యులు మరియు వైద్య సిబ్బందిచే ఉచిత కాన్సర్, కంటి నిర్ధారణ పరీక్షలు వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు. ముఖ్యంగా మహిళలు కాన్సర్ వ్యాధి బారిన పడకుండా రాష్ట్ర వ్యాప్తంగా సర్వైకల్ పరీక్షలు నిర్వహణకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. పేదోళ్లకు ఉపయోగపడాలని, దాని ద్వారా వారు ఆర్థికంగా చితికి పోకుండా ఆదిలోనే వ్యాధిని గుర్తించి, వ్యాధి అంతు చూడాలని ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి వివరించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పెరి మీటర్, హెల్త్ ఏటిఎం, ఈసీజీ వంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెల్త్ ఏ టి ఎం ద్వారా 64 రకాల వైద్య పరీక్షలను వేగంగా నిర్వహించే అవకాశం ఉంటుందని తెలిపారు. హెల్త్ ఏటియం ద్వారా నిర్వహించిన పరీక్షలకు కార్డు ఇస్తారని తద్వారా 5 సంవత్సరాలు వరకు రిపోర్ట్స్ భద్రంగా ఉంటాయని తెలిపారు. అలాగే కంటి పరీక్షల కోసం ప్రత్యేక యంత్రం, గుండె సంబంధిత సమస్యలను గుర్తించేందుకు ఈసీజీ యంత్రాన్ని కూడా ఏర్పాటు



చేసినట్లు వెల్లడించారు. మహిళలను సర్వైకల్ క్యాన్సర్ నుంచి రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు. మహిళలు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే వైద్య సేవలు పొందడానికి అవకాశం ఉంటుందని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యం, విద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శిధిలావస్థలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునిక వసతులతో పునర్నిర్మించి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. ప్రజల సౌకర్యార్థం ఆగస్టు 4వ తేదీన ఎంఎన్‌జే ఆసుపత్రి ఆధ్వర్యంలో మరో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించ నున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేపించు కోవాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి ఆరోగ్య పరీక్షలు చేపించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు. కాటారం డివిజన్ పరిధిలో 680 మందికి హైదరాబాద్ లో ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించి వారికి చూపు ప్రసాదించినట్లు మంత్రి వెల్లడించారు. మంథని నియోజక వ్యాప్తంగా 45వేల మందికి కంటి చికిత్సలు చేపించినట్లు మంత్రి తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ వైద్య క్యాంపులో భాగస్వాములైన ప్రతి ఒక్కరిని మంత్రి అభినందించారు. అంతకు ముందు మంత్రి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య పరికరాలను పరిశీలించారు. అనంతరం వైద్యులను శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, ఆసుపత్రుల సమన్వయ అధికారి డా శ్రీకాంత్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజాబాబు, విబిజి రాంజీ రాష్ట్ర సభ్యులు దండు రమేష్, కాటారం ఆర్డిఓ రవీందర్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపిడిఓ రవీంద్ర నాథ్, అంకాలజిస్టు డా సంతోష్ రెడ్డి, వైద్యులు సర్పంచ్ హసీనా భాను అక్బర్, కాటారం మార్కెట్ కమిటీ చైర్మన్ పంతకాని తిరుమల సమ్మయ్య, పిఏసిఎస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఐడిబిఐ మేనేజర్ చంద్ర మౌళీశ్వర రెడ్డి, కాళేశ్వర దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పొచ్చెర జలపాతానికి జలకళ



బోథ్. జూలై 31. (విజన్ ఆంధ్ర) : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గత మూడు నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. జిల్లాలో ప్రఖ్యాత జలపాతంగా పేరున్న బోథ్ మండలంలో పొచ్చెర జలపాతానికి వరద నీరు పోటెత్తడంతో జలకళ ను సంతరించుకుంది. కాగా భారీ వర్షాల నేపథ్యంలో జలపాత సందర్శనకు వచ్చిన పర్యాటకుల భద్రత దృష్ట్యా జల ప్రవాహం తగ్గే వరకు పర్యాటకుల సందర్శనకు అనుమతి లేదని అధికారులు పేర్కొంటున్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

## -మర్కుక్ మండల బీజేపీ పార్టీ ఉపాధ్యక్షులు మహేష్ గౌడ్

మర్కుక్ జూలై 31,(విజన్ ఆంధ్ర ) : సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రాజ్యాంగారి సత్తమ్మ కుటుంబ సభ్యులను శుక్రవారం నాడు మార్కుక్ మండల బీజేపీ పార్టీ ఉపాధ్యక్షులు తాడూరి మహేష్ గౌడ్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆర్థిక సాయాన్ని అందజేశారు. వారితో పాటు పాములపర్తి మాజీ ఎంపీటీసీ తాడెం గణేష్,నాయకులు స్వామి గౌడ్,నరేష్, స్వామి, బాలకృష్ణ, స్వామి,స్వామి,సురేష్,మహేష్,నితిన్,హరికృష్ణ,సాయి,అనిల్,రాజంగారి యాదగిరి,కిష్టయ్య,మరియు గ్రామస్తులు మహేష్,బాలనర్సయ్య,దేవయ్య తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాదం జరిగితేనే మేల్కొంటారా..?

- మార్కెట్ రోడ్డులో భారీ గుంత.. అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం
- రద్దీ మార్గంలో నిత్యం ప్రాణాలతో చెలగాటం.. వాహనదారులు, పాదచారుల అవస్థలు
- పలుమార్లు సమస్యను తెలియజేసినా స్పందన కరువు
- ప్రమాదం జరిగాక కాదు.. వెంటనే గుంతను పూడ్చాలని స్థానికుల విజ్ఞప్తి



పెద్ద శంకరంపేట్, జూలై 31: విజన్ ఆంధ్ర: మండల కేంద్రంలోని రద్దీగా ఉండే మార్కెట్ రోడ్డులో ఏర్పడిన భారీ గుంత రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతోంది. నిత్యం వందలాది మంది వాహనదారులు, పాదచారులు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నప్పటికీ, సమస్యను పరిష్కరించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గుంత మరింత లోతుగా మారి నీటితో నిండిపోవడంతో దాని లోతు గుర్తించడం కష్టంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటోందని వాపోతున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు ప్రజలు, స్థానిక మీడియా దృష్టికి తీసుకువచ్చినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. "ఎవరైనా ప్రాణాలు కోల్పోయిన తర్వాతే చర్యలు తీసుకుంటారా?" అంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. మార్కెట్ ప్రాంతంలో ఉన్న ఈ గుంతను తక్షణమే పూడ్చి, రహదారిని మరమ్మతు చేయాలని స్థానికులు ఆర్అండ్‌బీ, గ్రామపంచాయతీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారకముందే అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# శాస్త్రీయ పద్ధతులను అనుసరించి రైతులు మంచి దిగుబడులు సాధించాలి

## - ఉద్యాన శాఖ అధికారిణి సహజ

జన్నారం, జులై 30 (విజన్ ఆంధ్ర) : శాస్త్రీయ పద్ధ తులను అనుసరించి రైతులు మంచి దిగుబడులు సాధించాలని ఉద్యాన శాఖ అధికారిణి కే. సహజ అన్నారు. శుక్రవారం రోజున జన్నారం మండలంలో ని కవ్వాల్, కిష్టాపూర్ గ్రామాలలోని ఆయిల్ ఫామ్ తోటలను ఆమె సందర్శించారు. పంటల పెరుగుద ల, సాగు పరిస్థితులు మొక్కల ఆరోగ్యాన్ని పరిశీ లించి రైతులతో మాట్లాడారు. వివిధ దశల చీడపీ డలు, తెగుళ్ల నివారణకు అవసరమైన సస్యరక్షణ చర్యలు, ఎరువుల వినియోగం, నీటి యాజమా న్యంపై రైతులకు తగు సలహాలు సూచనలు చేశా రు. పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమ స్యలు తలెత్తిన వెంటనే ఉద్యాన శాఖ అధికారు లను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం ఉద్యాన రైతుల కోసం



వివిధ రకాల పథకాలు, స బ్సిడీలను అందిస్తుందని రైతులు వాటిని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాట్రిక్స్ ఆయిల్ పామ్ కంపెనీ ఎఫ్.ఈ కవిత, రై తులు పాల్గొన్నారు.

# ఆర్మూర్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ అవగాహన సదస్సు

### - కార్యక్రమంలో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వినయ్ కుమార్ రెడ్డి



ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా జూలై 31 (విజన్ ఆంధ్ర) : ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ పై అవగాహన సదస్సు కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు నరేష్ రెడ్డి గారు మరియు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు సుదర్శన్ రెడ్డి గార్లతో కలిసి ఆర్మూర్ పట్టణంలోని శ్రీ సాయి గార్డెన్ లో పాల్గొన్న ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి గారు ఈ సందర్భంగా వినయ్ కుమార్ రెడ్డి, మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్య క్రమంలో భాగంగా బాల్కొండ ఆర్మూర్ ఓటర్ల ఎన్రోల్మెంట్ 100% సాధించింది అని చెప్పడానికి గర్విస్తున్నాను ముఖ్యంగా ఆర్మూర్ బిఎల్ఓ లకు సూపర్వైజర్లకి అందరికీ పేరు పేరునా ధన్యవాదాలు. మాకు ఆర్మూర్ పట్టణంలో అయినా సరే మా సూపర్వైజర్లు ముఖ్యంగా నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వెంకటరామిరెడ్డి గారికి మరియు ఎస్ ఐ ఆర్ ఇన్చార్జిగా విచ్చేసిన సోడా చైర్మన్ అన్న గారికి ప్రత్యేక ధన్యవాదాలు అందరం సమిష్టిగా ఆర్మూర్ పట్టణంలో అన్ని క్లియర్ చేయడం జరిగింది సుమారు 25 వేల 800 ఓట్లు వరకు డబల్ ఓట్లు చనిపోయిన షిఫ్టింగ్ వాళ్ళు అధికంగా ఉన్నారు ఎందుకంటే గ్రామాల్లో చాలావరకు నాయకులకు గాని గ్రామస్తులకు ఒకటి గ్రామంలో మరొకటి ఆర్మూర్ పట్టణంలో ఉన్నది వాళ్లందరూ కూడా గ్రామాల్లో పెట్టుకుని పట్టణం నుంచి కూడా అందరు కూడా తీసేయడం జరిగింది కనుక 25 వేల 330 ఓట్ల వరకు డబల్ ఓట్లు ఉన్నాయి కనుక అవన్నీ కూడా తీసేసి 100% రెండు రోజుల క్రితమే కంప్లీట్ చేయడం జరిగింది. ఎటువంటి కార్యక్రమమైనా ఆర్మూర్ నియోజకవర్గంలో నుంచే ప్రారంభించడం జరుగుతుందని మీకు తెలియజేయడానికి కొత్తగా ఎన్నికైనటువంటి మండల అధ్యక్షులు గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన గ్రామ అధ్యక్షులు మెజార్టీ గ్రామంలో నియమించడం జరిగింది వారందరితో సమ న్యాయం చేసుకొని ముందుకు వెళ్తామని తెలియజేస్తున్నాను. ఎందుకంటే ప్రతి ఓటు కూడా చాలా ముఖ్యమైన ప్రతి ఓటుని కూడా మనం కచ్చితంగా ఎన్రోల్ చేసుకోవాల్సిన అవసరం ఉంది ఓటర్ లిస్టులో ఎక్కించే కార్యక్రమం కూడా కష్టపడి చేద్దామని చెప్పి ఇంకొక విషయం ఏమిటంటే నాకు తెలిసి తెలంగాణ రాష్ట్రంలో ఒక నియోజకవర్గంలో ఎక్కడ అత్యధిక మీటింగ్ జరిగాయి అంటే అది ఆర్మూర్ అని గర్వంగా తెలియజేస్తున్నాను ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు నరేష్ రెడ్డి అన్నకి తెలంగాణ రాష్ట్ర ముఖ్య సలహాదారు సుదర్శన్ రెడ్డికి ధన్యవాదములు తెలియజేస్తూ తప్పకుండా అన్ని విధాలుగా కలిసి ఓటరు సవరణ కార్యక్రమాన్ని కంప్లీట్ చేస్తామని తెలియజేస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చినందుకు వేదికపై ఉన్న పెద్దలందరికీ ధన్యవాదాలు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్య సలహాలు పుట్టినరోజు సందర్భంగా సుదర్శన్ రెడ్డి గారితో కేక్ కట్ చేయించి శాలువతో సత్కరించిన వినయ్ కుమార్ రెడ్డి ఈ కార్యక్రమంలో వారితో పాటు పాల్గొన్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి మరియు తెలంగాణ మినరల్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార మరియు చైర్మన్ కేశవ వేణు గారు తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తహర్బిన్ నిజాంబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు మానల మోహన్ రెడ్డి మార మోహన్ రెడ్డి ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులునియోజకవర్గ ఐదు మండల అధ్యక్షులు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గ్రామాల సర్పంచులు బాల్కొండ ఇన్చార్జి సునీల్ గారు ఆర్మూర్ కాంగ్రెస్ నాయకులు ఆకుల లలిత గారు బి ఎల్ ఎల్ యు సూపర్వైజర్లు బూత్ ఇన్చార్జిలు కాంగ్రెస్ పట్టణ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## హెల్త్ అసిస్టెంట్ 'గద్దల నర్సయ్య-సైదమ్మ'

### - దంపతులకు ఘన సన్మానం,ఉద్యోగ విరమణ..

### - వైద్యాధికారి రవి

మరిపెడ , విజన్ ఆంధ్ర: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా సుదీర్ఘ కాలం పాటు ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన గద్దల నర్సయ్య నేడు ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో డాక్టర్ రవి మరియు హాస్పిటల్ సిబ్బంది ఆయనను, వారి సతీమణి సైదమ్మ ని ఘనంగా సత్కరించారు. నర్సయ్య వారి సేవా నిరతిని కొనియాడుతూ.. ఈ దంపతులకు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి, జ్ఞాపికను (మెమెంటో) బహూకరించారు.

గద్దల నర్సయ్య 2003లో మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా కాంట్రాక్టు ఉద్యోగిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు.నాటి నుండి నిరంతరాయంగా ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తూ, 2023లో రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగిగా నియామకం పొందారు. నాటి నుండి నేటి వరకు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, ఈ రోజు విజయవంతంగా రిటైర్మెంట్ అయ్యారు. నర్సయ్య సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానంలో ఆయనకు వెన్నుదన్నుగా నిలిచిన సతీమణి సైదమ్మ ని కూడా సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఘన వీడ్కోలు కార్యక్రమంలో డాక్టర్ పూజిత,డాక్టర్ స్వామి, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయ లక్ష్మి,సీనియర్ అసిస్టెంట్ కుమార్, సూపర్వైజర్ ఆచార్యులు, లక్ష్మి కుమారి,మాధవి,పల్లె దవాఖానా సిబ్బంది, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొని నర్సయ్య-సైదమ్మ దంపతులకు భావోద్వేగ భరిత వీడ్కోలు పలికారు. ఈ దంపతుల విశ్రాంత జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు.

## షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇంటికి ఆర్థిక సాయం

వాజేడు,జూలై31(విజన్ ఆంధ్ర): వాజేడు మండల కేంద్రంలో చెన్నం రాజు అనే ఫోటోగ్రాఫర్ ఇల్లు గురువారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. సర్వం కోల్పోయిన ఫోటోగ్రాఫర్ ను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు కాకర్లపూడి విక్రాంత్, జగన్నాథ రాజు, పుష్పలత పరామర్శించి, పార్టీ తరపున పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. బాధితుడికి ఇందిరమ్మ ఇల్లు, ఎస్సీ కార్పొరేషన్ లోన్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు స్వరూప, కాకర్లపూడి కళ్యాణ్, చెన్నం ఎల్లయ్య, సీతారామరాజు, వాసు బాబు, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు

## మల్కాజిగిరిలో మరిన్ని ఓవర్ బ్రిడ్జులు, అండర్ బ్రిడ్జులు నిర్మించాలి

**- కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఈటల రాజేందర్ వినతి**

**- మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో పెరుగుతున్న రవాణా అవసరాలకు అనుగుణంగా కొత్త రైల్వే వంతెనలు మంజూరు చేయాలి**

**- ఇప్పటికే ఆమోదం పొందిన రైల్వే ఓవర్ బ్రిడ్జులు, అండర్ బ్రిడ్జుల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలి**

**- రైల్వే పట్టాలు దాటుతూ జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు శాశ్వత భద్రతా చర్యలు చేపట్టాలి**

**అవసరమైన ప్రతి చోట ఆటోలు, ద్విచక్ర వాహనాలు, పాదచారులకు అనువుగా చిన్న అండర్‌పాస్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జులు నిర్మించాలి**

**- వర్షాకాలంలో నీరు నిలిచి నిరుపయోగంగా మారుతున్న అండర్ బ్రిడ్జిల సమస్యకు దేశవ్యాప్త పరిష్కారం చూపాలి**

**- ప్రజల ప్రాణాల రక్షణే రైల్వే అభివృద్ధిలో అత్యున్నత ప్రాధాన్యంగా ఉండాలని కేంద్రానికి విజ్ఞప్తి**

కుత్బుల్లాపూర్, జులై 31 (విజన్ ఆంధ్ర) : తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేల బృందం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి కోరింది. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పలు కీలక అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో జనాభా, వాహనాల రాకపోకలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో మరిన్ని రైల్వే ఓవర్ బ్రిడ్జులు, అండర్ బ్రిడ్జులు అత్యవసరమని ఆయన వివరించారు. ఇప్పటికే ఆమోదం పొందిన నిర్మాణాలను ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని, కొత్త ప్రతిపాదనలకు కూడా వెంటనే ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో రైళ్ల వేగం, రైళ్ల రాకపోకల సంఖ్య గణనీయంగా పెరగడంతో ప్రజలు రైల్వే పట్టాలు దాటే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారని ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది పెరుగుతున్న ఈ ప్రమాదాలను అరికట్టేందుకు శాశ్వత కార్యాచరణ రూపొందించాలని కేంద్ర మంత్రిని కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రాంతాల్లో సుమారు 9 నుంచి 10 అడుగుల ఎత్తుతో, వీలైనంత వెడల్పుగా చిన్న అండర్‌పాస్‌లను నిర్మించాలని సూచించారు. అలాగే పట్టాలు తక్కువ ఎత్తులో ఉన్న చోట్ల పాదచారుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జులు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు గణనీయంగా తగ్గే అవకాశముందని తెలిపారు. ఇప్పటికే నిర్మించిన అనేక రైల్వే అండర్ బ్రిడ్జిల్లో వర్షాకాలంలో మూడు నుంచి నాలుగు అడుగుల మేర నీరు నిలిచిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కోట్ల రూపాయలు వెచ్చించిన నిర్మాణాలు నిరుపయోగంగా మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్య తెలంగాణకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ఉందని, శాశ్వత సాంకేతిక పరిష్కారం తీసుకురావాలని కేంద్ర రైల్వే శాఖను కోరారు. రైల్వే ప్రమాదాలను పూర్తిగా నివారించడం, ప్రజలకు సురక్షిత ప్రయాణ వాతావరణం కల్పించడమే ప్రభుత్వాల ఉమ్మడి లక్ష్యంగా ఉండాలని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేయాలని కేంద్ర రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశారు.

## ఉద్యోగస్తులకు పదవి విరమణ తప్పనిసరి

### - డిప్యూటీ డిఎం హెచ్ ఓ సుధాకర్ నాయక్

జన్నారం, జులై 30 (విజన్ ఆంధ్ర) : ఉద్యోగస్తులకు పదవి విరమణ తప్పనిసరి అని డిప్యూటీ డిఎం హెచ్ ఓ సుధాకర్ నాయక్ అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయిని గా పనిచేసిన జన్నారం మండల వాసి బాదావత్ నందునాయక్ పదవి విరమణ పొందిన సందర్భం గా శుక్రవారంరోజున మండలకేంద్రంలోని జ్యోతి గార్డెన్ లో పదవి విరమణ కార్యక్రమం ఏర్పాటు చే శారు. ఈ కార్యక్రమానికి జిల్లా డిప్యూటీ డిఎం హె చ్ ఓ ఎల్. సుధాకర్ నాయక్, జన్నారం మాజీ జ డ్పిటిసి ఐక్షి నాయకులు హాజరై నందునాయక్ దం పతులను శాలువతో సత్కరించి మెమెంటో అంద జేశారు.అనంతరం వారు మాట్లాడుతూ నందునా యక్ ఉ పాధ్యాయులుగా చేసిన సేవలు మరువలేని వని కొనియాడుతూ ఉ ద్యోగం అంటే పదోన్నతు లు పదవి విరమణ తప్పనిసరి అని ఎక్కడ



పని చేసిన తోటి వారితో మంచి పేరు సంపాదించుకోవ డమే ముఖ్యం అని అలా పేరు తెచ్చుకున్న వ్యక్తి నందునాయక్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జె.బాల్కోటి, తిరుపతిలోని వెంకటేశ్వర యూనివ ర్సిటీ ప్రొఫెసర్ బి. స్వరూపరాణి ఎస్సీ,ఎస్టీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూక్య రాజేష్ నాయక్, నేతలు చందులాల్,బి.ప్రకాష్ నాయక్ ,పున్నం నా యక్, రాము నాయక్, సుధాకర్ నాయక్, రాజా రాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకు కృషి చేస్తాం

## - టీయూడబ్ల్యూజే-హెచ్143 పరిగి నియోజకవర్గ అడహక్ కమిటీ కన్వీనర్ వి. శ్రీనివాస్ రావు



పరిగి, జులై 31(విజన్ ఆంధ్ర ): టీయూడబ్ల్యూజే–హెచ్143 (తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్–హెచ్143) పరిగి నియోజకవర్గ అడహక్ కమిటీ కన్వీనర్గా సీనియర్ జర్నలిస్టు వి. శ్రీనివాస్ రావు నియమితులయ్యారు. కో–కన్వీనర్లుగా పర్షమోని బాబయ్య, పండాల సురేష్, సీమ ఆనంద్, జి. అనంతరాములు, కుమార్, సతీష్ నియమితులయ్యారు.

ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్ మారుతి సాగర్ ఆధ్వర్యంలో జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్ రవీందర్, కో–కన్వీనర్ కొత్త శ్రీనివాస్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ కాలం నుంచే జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన ఏకైక సంఘం టీయూడబ్ల్యూజే–హెచ్143 అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ, జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాలపై నిరంతరం పోరాటం చేస్తూ సంఘం ముందుకు సాగుతుందని తెలిపారు.

గత కొన్నేళ్లుగా జర్నలిస్టులను నిర్లక్ష్యం చేసిన సంఘాలకు కనువిప్పు కలిగేలా ప్రతి జర్నలిస్టును సంఘంలోకి ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం పనిచేసే ఈ సంఘంలో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు సభ్యత్వం నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. సభ్యత్వం ద్వారా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం సంఘం మరింత బలోపేతంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు దుర్గాప్రసాద్, జ్యోతిర్లింగం, రఘు, సతీష్ కుమార్, చాంద్ పాషా, నర్సింలు, శ్రీనివాస్, రాఘవేంద్ర చారి, ఆంజనేయులు, సురేష్, కళ్యాణ్, నర్సింహా, మాణిక్యం, సత్యనారాయణ, రాజేందర్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



# అకాల వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు

పరిగి, జులై (విజన్ ఆంధ్ర) : పరిగి మున్సిపాలిటీ 11వ వార్డు పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీ, సాయిరాం నగర్ కాలనీల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా రహదారులు గుంతలమయంగా మారాయి. గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను తెలుసుకున్న 11వ వార్డు కౌన్సిలర్ ఎండి ఎజాస్ వెంటనే స్పందించి, రోడ్లపై మొరం (బ్లాక్ చిప్స్) వేయించి, జేసీబీ సహాయంతో గుంతలను పూడ్పించి రాకపోకలకు అనుకూలంగా మార్చించారు. సమస్యపై తక్షణమే స్పందించి చర్యలు చేపట్టిన కౌన్సిలర్ ఎండి ఎజాస్కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీం టీఆర్ఆర్ సభ్యులు, యువకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఎస్సి సెల్ మండల అధ్యక్షులు జాడి శివాజీ కు ఘన సన్మానం

గాదిగూడ, జులై 31(విజన్ ఆంధ్ర): మండలానికి చెందిన లోకారి కే గ్రామానికి చెందిన జాడి శివాజీ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ గాదిగూడ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు.నియమితులైన జాడి శివాజీ ను శుక్రవారం గాదిగూడ మండల ఎస్సి సమాజ్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ,"పార్టీ నాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతానికి అలాగే ఎస్సి సమాజ్ సేవ కోసం కృషి చేస్తాను"అని తెలిపారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి గౌరవించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.అలాగే,ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర జిల్లా కాంగ్రెస్ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.శివాజీ నియామకంతో స్థానిక మండల ఎస్సి ప్రజలల్లో ఉత్సాహం నెలకొంది.కార్యక్రమంలో అనిల్ మోటారే ఎస్సి షెడ్యూల్ అధ్యక్షులు, విలాస్ ఎస్సి వైస్ షెడ్యూల్ అధ్యక్షులు, లక్ష్మాన్ బట్లాడే, కనక ప్రభాకర్, రాహుల్ జాబడే, నోవనాథ్ గాయక్వాడ్, చంద్రకాంత్ మోరే,ప్రకాష్ సూర్యావంశీ, సంతోష్,ఎస్సి సమాజ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన బీజేపీ నాయకులు




పరిగి,జులై 31(విజన్ ఆంధ్ర ): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ (సార్) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల ప్రవాస్ అభియాన్ సందర్భంగా పరిగి మండలంలోని జాఫర్పల్లి, కడ్లపూర్, లక్ష్మీదేవిపల్లి, రాపోల్, తొండపల్లి గ్రామాల్లో ఓటరు జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బీజేపీ పరిగి మండల అధ్యక్షురాలు అనసూయ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో, సార్ పరిగి మండల ప్రభారి బండలింటి రామచంద్రయ్య, బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్చార్జ్ మారుతి కిరణ్ బూనేటి, పార్టీ బిఎల్ఎలు, సంబంధిత బిఎల్వో లతో కలిసి ఓటరు జాబితాను పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఓటరు జాబితాలో ఏవైనా తప్పులు, మార్పులు లేదా కొత్త నమోదులు అవసరమైతే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి సవరణలు చేయించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటు విలువైనదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పరిగి అసెంబ్లీ కన్వీనర్ ఉగ్ర నరసింహ, సార్ పరిగి అసెంబ్లీ ఇన్చార్జ్ గేరింటి కేశవులు, బీజేపీ సీనియర్ నాయకులు దోమ రమేష్ కుమార్, నస్కల్ వెంకటయ్య, శ్యాంసుందర్, నరసింహులు, శ్రీనివాస్, తొండపల్లి శ్రీశైలం, లక్ష్మీదేవిపల్లి శ్రీశైలం, యువ నాయకులు మనోహర్ గౌడ్, వివేకానంద, రాజేందర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నీరు నిల్వకుండా చర్యలు...

బోధన్, జులై31 (విజన్ ఆంధ్ర) : గత నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బోధన్ పట్టణంలోని పలు కాలనీలు నీట మునిగాయి. పట్టణంలోని రాకాసిపేట్ వార్డులో వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉన్నందున,కౌన్సిలర్ జహీర్ పరిస్థితి తెలుసుకొని, మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మశరత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్బంగా స్పందించిన మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి శుక్రవారం కాలనీని సందర్శించారు. మున్సిపల్ సిబ్బందితో అక్కడ నిల్వ ఉన్న నీటిని డ్రైనేజీలోకి వెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులు కౌన్సిలర్ జహీర్, ఫ్లోర్ లీడర్ శరత్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.



# వరద బాధితులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

వాజేడు,జూలై31(విజన్ ఆంధ్ర): గోదావరి వరద బాధితులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని బిఆర్ఎస్ వాజేడు మండల అధ్యక్షులు పెనుమల్లు రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వెంకట్ రెడ్డి ఇంటిని గోదావరి వరద చుట్టుముట్టడంతో కృష్ణారెడ్డి స్వయంగా సామాగ్రిని ట్రాక్టర్ వరకు మోసుకు వెళ్లి, సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. అర్హులైన వరద బాధితులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని లేనియెడల బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు

# బోనాల ఉత్సవాలకు సర్వం సిద్ధం

**మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి.**

**మున్సిపల్ చైర్పర్సన్ కుడుముల రజిత వెంకటేష్**



పరిగి, జులై31(విజన్ ఆంధ్ర ): పరిగి పట్టణంలో ప్రతి ఏడాది ఆషాఢమాసం సందర్భంగా నిర్వహించే బోనాల ఉత్సవాలను ఈసారి ఆగస్టు 2, 3 తేదీల్లో వైభవంగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ తెలిపారు.

ఆమె మాట్లాడుతూ, ఆగస్టు 2న మైసమ్మ తల్లి బోనాలు, ఆగస్టు 3న పోచమ్మ తల్లి బోనాలు ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరిగి పట్టణ ప్రజలందరూ కుటుంబ సమేతంగా బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

ఆదివారం, సోమవారం జరిగే ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను మైసమ్మ, పోచమ్మ దేవాలయాల వద్ద ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. పరిగి పట్టణ మహిళలు, యువకులు, పెద్దలు, హిందూ బంధువులందరూ భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను శాంతియుతంగా, సంప్రదాయబద్ధంగా, వైభవంగా నిర్వహించి విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ విజ్ఞప్తి చేశారు.

# అనుక్షణం అప్రమత్తంగా ఉండండి

**-ఐటీడీఏ పిఓ లెనిన్**



వాజేడు,జూలై31(విజన్ ఆంధ్ర) : భారీ వర్షాలతో పెరుగుతున్న గోదావరి నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. శుక్రవారం చీకుపల్లి గ్రామంలో గోదావరి ఉధృతిని పరిశీలించారు. గోదావరి ఇంకా పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. వరద బాధితులను గుర్తించి పునరవస కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వాజేడు తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కృపాకర్ తదితరులు పాల్గొన్నారు

# ఈనెల 5న మండల సర్వసభ్య సమావేశం

మల్హర్ , జూలై 31 విజన్ ఆంధ్ర : మల్హర్ రావు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమీక్షా సమావేశాన్ని ఈనెల 5వ తేదీ బుధవారం ఉదయం 11:00 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ క్రాంతి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి, మిషన్ భగీరథ, వ్యవసాయం, విద్యుత్, ఇందిరమ్మ ఇండ్ల ప్రగతితో పాటు మొత్తం 21 ప్రభుత్వ శాఖల పురోగతిపై సమీక్ష జరగనుందని మండల స్థాయి అధికారులు అందరూ తమ శాఖల ప్రగతి నివేదికలను ఆగస్టు 3వ తేదీ లోగా మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

# పిహెచ్ సి ని సందర్శించిన ఫాక్స్ చైర్మన్.. ఇప్ప మొండయ్య

**పిహెచ్ సి లో మెరుగైన సేవలు అందించాలని సూచన**

మల్హర్, జూలై 31 విజన్ ఆంధ్ర : మల్హర్ రావు మండల కేంద్రమైన తాడిచర్ల పిహెచ్ సి ని శుక్రవారం తాడిచర్ల ఫాక్స్ చైర్మన్ ఇప్ప మొండయ్య సందర్శించారు. ఈ సందర్భంగా పాము కాటుకు గురై పిహెచ్ సి లో చికిత్స పొందుతున్న పెద్దతూండ్ల గ్రామానికి చెందిన తాళ్ల రాజిరెడ్డిని పరామర్శించారు. ఇటీవల పాముకాటుకు గురై మృతి చెందిన విద్యార్థి కి అందించిన ప్రథమ చికిత్స పై వైద్యాధికారి డాక్టర్ వినయ్ భాస్కర్ ను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు, పాము,తేలు తదితర విష కీటకాలకు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కుల వెంకటస్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# రిటైర్మెంట్ బెనిఫిట్ల కోసం అవసరమైతే న్యాయపోరాటానికి సిద్ధం కావాలి



**-- రిటైర్డ్ ఒకేషనల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు అశ్వక్ అహ్మద్**

అక్కన్నపేట, జూలై 31 (విజన్ ఆంధ్ర) : విరమణ పొందిన, త్వరలో విరమణ పొందనున్న వృత్తి విద్యాధ్యాపకులకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్లు తీవ్ర జాప్యానికి గురవుతున్నాయని రిటైర్డ్ ఒకేషనల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు అశ్వక్ అహ్మద్ తెలిపారు. సంబంధిత అధికారులను పలుమార్లు సంప్రదించినప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో, అవసరమైతే చట్టబద్ధమైన మార్గంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించడం కూడా ఒక ప్రత్యామ్నాయమని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా న్యాయవాది మల్లికార్జున శర్మను సంప్రదించినట్లు తెలిపారు. కేసు దాఖలు సమయంలో రూ.5,000, అనంతరం కోర్టు తదుపరి ప్రక్రియలో మరో రూ.5,000 ఫీజు ఉంటుందని ఆయన వివరించినట్లు చెప్పారు. గతంలో పలువురు ఉపాధ్యాయులు కూడా ఆయన ద్వారా తమ కేసులను న్యాయపరంగా ముందుకు తీసుకెళ్లినట్లు సమాచారం ఉందన్నారు.

ఆసక్తి గల ఉపాధ్యాయులు కేసు విధానం, అవసరమైన పత్రాలు, ఫీజులు తదితర వివరాలను న్యాయవాదిని నేరుగా సంప్రదించి తెలుసుకుని, తమ స్వంత నిర్ణయం మేరకు ముందుకు వెళ్లాలని సూచించారు.

న్యాయవాది: మల్లికార్జున శర్మ

ఫోన్: 8179060421

ప్రస్తుతం సీపీఎస్ పరిధిలోని ఉద్యోగులు, విరమణ పొందిన వృత్తి విద్యాధ్యాపకుల సమస్యల పరిష్కారంలో జాప్యం కొనసాగుతోందని, తమ హక్కుల సాధన కోసం అందరూ అప్రమత్తంగా ఉండాలని అశ్వక్ అహ్మద్ కోరారు.

# రాత్రి పగలు తేడా లేకుండా కోతులతో నరకం అనుభవిస్తున్న పట్టణ ప్రజలు

**- స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్, పాలకవర్గం అధికారులు పట్టించుకోవాలని ప్రజల వినతి**



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 31 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణములో అధికారులు పాలకవర్గ నిర్లక్ష్యం, పట్టించుకోకపోవడంతో కోతులతో పట్టణ ప్రజలు తీవ్ర నరకం అనుభవిస్తున్నారు. ఈ సందర్భంగా కోతులు రాత్రి పగలు అని తేడా లేకుండా అర్ధ రాత్రికు కూడా ప్రజలకు భయబ్రాంతులకు గురిచేస్తున్నాయి. హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం ఇరవై వార్డులుండగా ప్రతి వార్డులోని ప్రతి గల్లీ గల్లీలో ఉదయం లేవడంతోనే మొదలు రాత్రి కూడా కోతులు ఇండ్లలోకి రావడం ఇంట్లో ప్రతి వస్తువులు వంట పాత్రలు వంట సామాగ్రి ఎత్తుకుపోతున్నాయి. పిల్లలు వృద్ధులు వికలాంగుల మీదికి కోతులు వస్తున్నాయి తీవ్రగాయల పాలు చేస్తున్నాయి. రేకుల ఇండ్లలో కోతుల మంద మొత్తం రేకులు ఉడదిస్తున్నాయని గునేపెంకుల ఇళ్లలో పెంకులు మొత్తం తీసి బయట పడేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతులు తరలించడానికి లక్షల బడ్జెట్ పెడుతున్నామని చెప్పి ఖర్చు చేస్తున్నామని చెప్పున్నప్పటికీ పట్టణంలో కోతులు మాత్రం వందలు కాదు వేలల్లో ఉన్నాయి. చర్యలు మాత్రం శూన్యం కొద్ది రోజుల కింద కోతులు తరలించామని పాలకవర్గం చెబుతున్నప్పటికీ వాస్తవంగా మాత్రం కోతులు ఎక్కడ తరలించలేదని ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీంతో మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు తీవ్రంగా అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా కోతులు పట్టణ ప్రజలకు తీవ్ర నరకం చూపిస్తున్నాయని పాఠశాల, కాలేజీ విద్యార్థులు ఉద్యోగాలకు వెళ్లే మహిళలు రోడ్డపై నడవాలంటే బయటికి వెళ్లాలంటే భయపడుతున్నారని, వృద్ధులు వికలాంగులు రోడ్డు మీదకి రావాలంటే కోతులతో ఇబ్బంది పడుతున్నారని ఎన్నిసార్లు అధికారులకు విన్నపించిన చర్యలు తీసుకోవడం లేదని పట్టణ ప్రజలు తీవ్ర స్వరంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ పాలకవర్గం, స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించాలని పట్టణంలో కోతులను పట్టణానికి దూరంగా తరలించాలని కోతుల బెడద లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# కలమడుగు గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం

జన్నారం, జులై 30 (విజన్ ఆంధ్ర) : కలమడుగు గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాని ఘనంగా నిర్వహించారు. జన్నారం మండలంలోని కలమడు గు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రోజున అధికారులు, ప్రజాప్రతినిధులు పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధు లు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, పౌర బాధ్యతలు, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన క ల్పించారు. ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు విధులను కూడ బాధ్యతాయుతంగా నిర్వర్తించాల ని బాల్య వివాహాలను నిషేధించడం, కుల వివక్ష అనేది లేకుండా చూడాలని వివరిస్తూ సివిల్ రైట్ డే సందేశాన్ని ప్రజలకు చేరవేస్తూ అవగాహన కా ర్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబం ధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ స్థులు పాల్గొన్నారు



# కొండాపూర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు

**- ప్రజల భద్రతకు కీలకమన్న ఎస్ఐ గంగారం**

బెల్లంపల్లి , జూలై 31 విజన్ ఆంధ్ర : ప్రజల భద్రత, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని దేవాపూర్ ఎస్ఐ గంగారం అన్నారు. కాసిపేట మండలం కొండాపూర్ యాపలో స్థానిక సర్పంచ్, వ్యాపారులు కలిసి నాలుగు పాత సీసీ కెమెరాలను మరమ్మతు చేయించి, మరో మూడు కొత్త కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ గంగారం మాట్లాడుతూ, నేరస్థుల గుర్తింపు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి గ్రామం, వ్యాపార సంస్థ తమ పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజల సహకారంతో నేరాలను మరింత సమర్థంగా అరికట్టవచ్చని పేర్కొన్నారు.



# దౌల్తాబాద్‌లో బైక్ చోరీ.. నిందితుడికి రిమాండ్



దౌల్తాబాద్,జూలై 31 (విజన్ ఆంధ్ర) : దౌల్తాబాద్ మండల కేంద్రంలో జరిగిన బైక్ చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గంగాధర్ అరుణ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం సమీపంలోని కల్లు కాంపౌండ్ వద్ద పార్క్ చేసిన బైక్‌ను కొండాపూర్ గ్రామానికి చెందిన వరదం యాదగిరి దొంగిలించాడు. అనంతరం వాహనాన్ని విక్రయించేందుకు వెళ్తుండగా దౌల్తాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలను పార్క్ చేసే సమయంలో తప్పనిసరిగా లాక్‌లు, ఇతర భద్రతా పరికరాలను వినియోగించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# భూపాలపల్లి లో ఘనంగా భోనాల పండుగ

భూపాలపల్లి జిల్లా జులై 31 (విజన్ ఆంధ్ర ) జిల్లా కేంద్రంలో గల ఓసీ 2లో దుర్గామాత గుడి ఆవరణలో బోనాల పండగ అంగరంగ వైభవంగా జరిగాయి. సింగరేణి జనరల్ మేనేజర్ దంపతులు బోనాల తో వచ్చి అమ్మవారికి బోనం సమర్పించారు. ఈయొక్క బోనాల ఊరేగింపులో హిజ్రాల నృత్యంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్ నుండి 2ఇన్ క్లయిన్ దుర్గామాత టెంపుల్ వరకు డిజే సౌండ్‌తో హిజ్రాల నృత్యం అందరిని అల్లరింపచేసింది ఈ బోనాల పండుగకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి భోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

# ఎస్ఐఆర్ విజయవంతమే లక్ష్యం..

## బూత్ స్థాయిలో సమన్వయంతో పనిచేయాలి: అత్తాపురం శ్రీనివాస్ గౌడ్



చేవెళ్ల, జూలై 30 (విజన్ ఆంధ్ర): రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను బూత్ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి అత్తాపురం శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా ఆయన పలు బూత్‌లను సందర్శించారు. ఆయా బూత్‌లలో పార్టీ బూత్ స్థాయి కార్యకర్తలు, బీఎల్ఏలతో సమావేశమై ఎస్ఐఆర్ అమలు తీరును సమీక్షించారు. అనంతరం బీఎల్ఏ నివాసంలో కార్యకర్తలతో కలిసి భోజనం చేసి అక్కడే బస చేశారు. ఈ సందర్భంగా అత్తాపురం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రతి ఓటరికి పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా అవసరమైన దరఖాస్తులు, అభ్యంతరాలు, సవరణలను సకాలంలో పూర్తి చేయాలని బూత్ స్థాయి నాయకులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలు కీలకమని పేర్కొన్న ఆయన, ప్రతి కార్యకర్త ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ ప్రభుత్వ పథకాలు, పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా చేర్చాలని కోరారు. కార్యకర్తల సమన్వయం, ప్రజలతో నిరంతర అనుసంధానం ద్వారానే ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా సేవా కార్యక్రమాలను కొనసాగించాలని, సమష్టి కృషితో పార్టీని మరింత బలపరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు అత్తెల్లి విట్టల్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శి గొండ్ల కృష్ణ గౌడ్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి, మున్సిపల్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బీజేవైఎం నేతలు బండారి చంద్రశేఖర్ రెడ్డి, వడ్డే గణేష్, జై సింహా రెడ్డి, అభిషేక్ రెడ్డి, వెంకటేష్ పాగ, బూత్ అధ్యక్షులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రేగులగూడలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

## - వాహన తనిఖీలు.. సైబర్ నేరాలపై అవగాహన



బెల్లంపల్లి , జూలై 31 విజన్ ఆంధ్ర : నేరాల నియంత్రణ, ప్రజల్లో భద్రతపై అవగాహన కల్పించేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో కాసిపేట మండలం దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేగులగూడ గ్రామంలో శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. దేవాపూర్ ఎస్ఐ గంగారాం నేతృత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో 30 ద్విచక్ర వాహనాలు, ఐదు ఆటోలను తనిఖీ చేసి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గంగారాం మాట్లాడుతూ, సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని లింకులు తెరవవద్దని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు. ఫేక్ కాల్స్, ఫిషింగ్ సందేశాలు, సోషల్ మీడియా మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, అత్యవసర పరిస్థితుల్లో డయల్--100 సేవలను వినియోగించాలని కోరారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు కీలకమని, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలతో పాటు ఇళ్ల వద్ద కూడా సీసీటీవీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజల్లో భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాపూర్ పోలీసు సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

**- బెల్లంపల్లి మున్సిపల్ సమావేశంలో 18 తీర్మానాలకు ఆమోదం**

**- తాగునీరు.. పారిశుద్ధ్యం.. వీధిదీపాలు.. రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం**



బెల్లంపల్లి, జూలై 31 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి పట్టణ అభివృద్ధికి మున్సిపల్ కౌన్సిల్ కీలక నిర్ణయాలు తీసుకుంది. శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మొత్తం 21 అజెండా అంశాలను చర్చించగా, వాటిలో 18 తీర్మానాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, పారిశుద్ధ్య సేవలను బలోపేతం చేయడం, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పట్టణ ఆదాయ వనరులను పెంచే అంశాలపై కౌన్సిల్ కీలక నిర్ణయాలు తీసుకుంది.

సమావేశంలో వివిధ వార్డుల్లో తాగునీటి పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు, పంపుసెట్ల నిర్వహణకు రూ.1.23 లక్షలు మంజూరు చేశారు. వీధిదీపాల వైరింగ్, అత్యవసర మరమ్మతులు, కొత్త వీధిదీపాల కొనుగోలుకు కలిపి రూ.2.06 లక్షలు కేటాయించారు. మున్సిపల్ కార్యాలయ అవసరాల కోసం 50 కుర్చీల కొనుగోలుకు రూ.25 వేల వ్యయాన్ని కూడా ఆమోదించారు.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకు రూ.50 వేలు, కాలువల శుభ్రతకు అవసరమైన పనిముట్ల కొనుగోలుకు మరో రూ.50 వేలు మంజూరు చేశారు. అలాగే పట్టణంలోని 34 వార్డుల్లో పారిశుద్ధ్య సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అదనంగా 10 మంది పారిశుద్ధ్య కార్మికులను ఆరు నెలలపాటు రోజువారీ కూలి ప్రాతిపదికన నియమించాలని తీర్మానించారు.

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు రూ.20 వేల ముందస్తు నిధులను విడుదల చేయాలని నిర్ణయించారు. కూరగాయల మార్కెట్--అంబేద్కర్ విగ్రహం మార్గంలో ప్రజల రాకపోకలకు అడ్డంకిగా ఉన్న గోడ తొలగింపునకు రూ.1 లక్ష మంజూరు చేశారు.

పట్టణ ఆదాయాన్ని పెంచే చర్యల్లో భాగంగా బెల్లంపల్లి బజార్‌లోని 165 సింగరేణి దుకాణాలను మున్సిపాలిటీ ఆధీనంలోకి తీసుకొచ్చే ప్రతిపాదనకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సుభాష్‌నగర్, బుడిదగడ్డ బస్తీల్లో బస్తీ దవాఖానలు ఏర్పాటు చేయాలని తీర్మానించి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించింది.

ఇంటి నంబర్ల నమోదులో జాప్యాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. కంప్యూటర్ల మరమ్మతులు, ప్రింటర్ కార్ట్రిడ్జ్ రీఫిల్లింగ్‌కు రూ.30 వేలు, స్టేషనరీ కొనుగోలుకు రూ.30 వేలు, కౌన్సిలర్ల శిక్షణా కార్యక్రమాలకు రూ.35 వేలు మంజూరు చేశారు. గాంధీ చౌరస్తా నుంచి ఎంపీడీవో చౌరస్తా వరకు ప్రతిపాదించిన 80 అడుగుల రహదారి అభివృద్ధి ప్రణాళికకు అవసరమైన సర్వే, డ్రాయింగ్‌ల తయారీకి రూ.99 వేల వ్యయాన్ని ఆమోదించారు. అకౌంట్స్ విభాగానికి అత్యవసరంగా కొనుగోలు చేసిన కూలర్‌కు సంబంధించిన రూ.4 వేల వ్యయాన్ని కూడా సమావేశం ఆమోదించింది.

కౌన్సిల్ ఆమోదించిన ఈ తీర్మానాలతో బెల్లంపల్లి పట్టణంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య సేవలు, వీధిదీపాల నిర్వహణ, రహదారుల అభివృద్ధి పనులు వేగం పుంజుకోనున్నాయి. అదే సమయంలో మున్సిపాలిటీ ఆదాయ వనరుల బలోపేతం, ప్రజారోగ్య సేవల విస్తరణకు కూడా ఈ నిర్ణయాలు దోహదం చేయనున్నాయి.

# కొత్త బస్టాండ్‌లో భారీ గుంత

## అధికారులు వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలి: టీడీపీ నేతలు



బెల్లంపల్లి జులై 31 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి పట్టణంలోని కన్నాలబస్తీ సమీప కొత్త బస్టాండ్‌లో భారీ వర్షాల కారణంగా బస్టాండ్ మధ్యలో లోతైన గుంత ఏర్పడిందని టీడీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గుంత ఏర్పడటానికి కారణాలను ఆర్టీసీ సివిల్ విభాగం, రెవెన్యూ అధికారులు, సబ్‌కలెక్టర్ సంయుక్తంగా పరిశీలించాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. మణిరాం సింగ్ కోరారు. మహారాష్ట్ర, హైదరాబాద్‌తో పాటు బెల్లంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఈ బస్టాండ్‌ను వినియోగిస్తున్నారని, సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు కూడా ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తున్నందున వెంటనే భద్రతా చర్యలు చేపట్టాలని అన్నారు.

మూసివేసిన అండర్‌గ్రౌండ్ గనుల ప్రభావం ఉందేమో సింగరేణి యాజమాన్యం కూడా పరిశీలించాలని, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ వేయాలని సూచించారు. పరిస్థితిని ఎమ్మెల్యే పరిశీలించి అవసరమైతే తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు వెంటనే స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని టి. మణిరాం సింగ్, గజ్జల దుర్గయ్య, ఆర్. హరిబాబు, మల్లయ్య, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు పోచమల్లు హెచ్చరించారు.

# జీతాల నుంచి ఈహెచ్‌ఎస్ కోతలపై సమీక్ష జరపాలి

**- రిటైర్డ్ ఒకేషనల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డి**

అక్కన్నపేట, జులై 31 (విజన్ ఆంధ్ర) : ఉద్యోగుల హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) అమలులో నెలకొన్న లోపాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమీక్షించాలని రిటైర్డ్ ఒకేషనల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డి కోరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెల్త్ కార్డుల జారీ ప్రక్రియ పూర్తికాకముందే, కార్పొరేట్ ఆస్పత్రులతో పూర్తి స్థాయి ఒప్పందాలు లేకుండానే ఉద్యోగుల మే నెల జీతాల నుంచి 1.5 శాతం చొప్పున కోత విధించడం ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమైందన్నారు. భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే ఇద్దరి వేతనాల నుంచీ కోత విధించడం కూడా పునఃపరిశీలన చేయాల్సిన అంశమని పేర్కొన్నారు. ఉద్యోగులకు పూర్తి స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి రాకముందే వేతనాల నుంచి కోతలు విధించడం సరైన విధానం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈహెచ్‌ఎస్ అమలులో ఉన్న లోపాలపై సమగ్ర సమీక్ష నిర్వహించి, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లలో అసంతృప్తి మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్, ఆర్ఐ

చౌటకూర్, జులై 31 (విజన్ ఆంధ్ర):- చౌటకూర్ మండలంలోని పరిధిలోని వెండికోల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, హాజరు నమోదు, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలతో పాటు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సేవలను సమర్థవంతంగా అందించాలని ఈ సందర్భంగా సిబ్బందికి అధికారులు సూచించారు. చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించడంతో పాటు కేంద్రాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, హాజరు నమోదును సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే సంక్షేమ సేవలను నాణ్యతతో అమలు చేయాలని, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు అంగన్‌వాడీ సిబ్బందికి మార్గదర్శనం చేశారు.



# అంతర్రాష్ట్ర గృహ చోరీ ముఠా అరెస్ట్

దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం.. ఏన్కూరు గ్రామానికి చెందిన గాదె నాగరాజు ఏన్కూరు మండలం జన్నారం గ్రామానికి చెందిన తన బాబాయి గాదె రామారావుతో ఆస్తి వివాదం ఉండటంతో, అతని ఇంటిలో నగదు, బంగారు ఆభరణాలు, ఆస్తి పత్రాలు ఉన్నాయని భావించి, వాటిని దొంగిలించేందుకు కుట్ర పన్నాడు. గతంలో నాగరాజు హుజూర్‌నగర్ సబ్‌జైలులో ఉన్న సమయంలో పరిచయమైన చిల్లరి సురేష్, జల్లేపల్లి వెంకటేశ్వరరావు, ఖాజా, నాగవీర భాస్కరరావులకు ఈ విషయం చెప్పి, తన బాబాయి ఇంటిలో దొంగతనం చేయాలని ప్రోత్సహించాడు. ఈ క్రమంలో నిందితులు గుంటూరు నుండి ఏన్కూరుకు వచ్చి ముందుగా గాదె రామారావు ఇంటిని లక్ష్యంగా చేసుకున్నారు. అయితే ఇంట్లో కుటుంబ సభ్యులు ఉండటంతో దొంగతనం చేయలేకపోయారు. అనంతరం సమీపంలో తాళం వేసి ఉన్న అన్నదేవర రాధమ్మ ఇంటిని గమనించి, తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువా పగులగొట్టి నగదు రూ. 1,10,000లతో పాటు బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. అనంతరం గ్రామ శివారులో ఆ సొత్తును వాటాలుగా పంచుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. అయితే తమ అసలు లక్ష్యమైన గాదె రామారావు ఇంటిలో దొంగతనం చేయాలనే ప్రయత్నాన్ని నిందితులు అక్కడితో ఆపలేదు. అదే నెలలో మరోసారి ఏన్కూరుకు వచ్చి గాదె రామారావు ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారు. కానీ ఇంటి వద్ద ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో దొంగతనం చేయకుండా వెనుదిరిగారు. ఈ ఏడాది జనవరిలో మళ్లీ గుంటూరు నుండి ఏన్కూరుకు వస్తున్న మార్గంలో ఖమ్మం జిల్లా, తల్లాడ మండలం, అన్నారుగూడెం గ్రామంలో తాళం వేసి ఉన్న ఒక ఇంటిలో దొంగతనం చేసి బంగారు చంద్రహారం, వెండి పట్టీలు అపహరించారు. అనంతరం ఏన్కూరుకు వచ్చి గాదె రామారావు ఇంటి వద్ద మరోసారి రెక్కీ నిర్వహించినప్పటికీ ఇంటి పరిసరాల్లో ప్రజలు ఉండటంతో తమ ప్రణాళికను అమలు చేయలేక తిరిగి వెళ్లిపోయారు. ఫిబ్రవరిలో మరోసారి ఏన్కూరుకు వచ్చి గాదె రామారావు ఇంటి వద్ద దొంగతనానికి ప్రయత్నించి తిరుగు ప్రయాణంలో మార్గమధ్యంలో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని పలు ప్రాంతాల్లో గృహచోరీలకు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నారు. దర్యాప్తులో నిందితులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అనేక గృహచోరీ కేసులకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాకు చెందినవారని, దొంగిలించిన బంగారు ఆభరణాలను గాదె వెంకట్ రెడ్డి ద్వారా విక్రయించేందుకు ప్రయత్నించారు. ఈ కేసులో నిందితులు వ్యవస్థీకృత నేర ముఠాగా పనిచేసినట్లు తేలింది. ప్రస్తుతం జల్లేపల్లి వెంకటేశ్వరరావు, గాదె నాగరాజులను అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా, చిల్లరి సురేష్ పీడీ చట్టం కింద జైలులో ఉన్నాడు. ఖాజా నాగ వీర భాస్కరరావు, గాదె వెంకట్ రెడ్డి పరారీలో ఉండగా, వారి అరెస్టు, మిగిలిన చోరీ సొత్తు స్వాధీనం కోసం దర్యాప్తు కొనసాగుతోంది.

**-దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన ముఖ్యాంశాలు**

దర్యాప్తులో నిందితులు అత్యంత ప్రమాదకరమైన అంతర్రాష్ట్ర గృహచోరీ ముఠాకు చెందిన వారని వెల్లడైంది. జల్లేపల్లి వెంకటేశ్వరరావుపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి 23కు పైగా క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. ఇతనిపై గుంటూరు జిల్లా నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ కూడా కొనసాగుతోంది. గృహచోరీలు, దొంగతనాలు, ఇతర ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడుతూ, పలుమార్లు అరెస్టై జైలుకు వెళ్లినప్పటికీ తన నేర కార్యకలాపాలను కొనసాగిస్తున్న అలవాటైన నేరస్థుడిగా దర్యాప్తులో తేలింది. చిల్లరి సురేష్ పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 35కు పైగా గృహచోరీ, దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి. ప్రస్తుతం ఇతను రాజమండ్రి సెంట్రల్ జైలులో పీడీ చట్టం కింద నిర్బంధంలో ఉన్నాడు. ఇతను అంతర్రాష్ట్ర గృహచోరీ ముఠాలో కీలక సభ్యుడిగా, అనేక జిల్లాల్లో వరుసగా గృహచోరీలకు పాల్పడిన ప్రమాదకర నేరస్థుడిగా ఉన్నట్లు తేలింది. దర్యాప్తులో అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే ఏన్కూరు గ్రామానికి చెందిన గాదె నాగరాజు తన బాబాయి గాదె రామారావు ఇంటిలో దొంగతనం చేయించేందుకు ఇలాంటి అత్యంత ప్రమాదకరమైన, అలవాటైన అంతర్రాష్ట్ర నేరస్థులను స్వయంగా సంప్రదించి ఏన్కూరుకు పిలిపించాడు. తన వ్యక్తిగత ఆస్తి వివాదాన్ని పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతో పలుమార్లు రెక్కీ నిర్వహింపజేసి, దొంగతనం చేయించేందుకు కుట్ర పన్నినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుల గత నేర చరిత్ర, వారి నిర్వహణ విధానం, రాష్ట్రాల మధ్య సంచరిస్తూ నేరాలు చేయడం, సంఘటితంగా పనిచేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, ఈ కేసులో బిఎన్ఎస్ సెక్షన్ 111ను కూడా చేర్చడం జరిగిందని, దర్యాప్తు కొనసాగుతోందని ఎస్సై తెలిపారు.

ఈ సందర్భంగా ప్రజలకు ఎస్.సంధ్య పలు సూచనలు చేశారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో తలుపులు, కిటికీలు సక్రమంగా మూసి ఉన్నాయో లేదో ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని, ఇళ్లను ఎక్కువ రోజుల పాటు మూసి ఉంచాల్సి వస్తే సమీప బంధువులు లేదా పొరుగువారికి సమాచారం ఇవ్వాలని, వీలైనంత వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాలు, కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు సంచరిస్తున్నట్లు గమనిస్తే వెంటనే డయల్-100కు, సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరిస్తే ఆస్తి నేరాలను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ఏన్కూరు పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ నాగేంద్రబాబు, పోలీస్ కానిస్టేబుళ్లు రవి, శంకర్, వినయ్, సాంకేతిక ఆధారాల సేకరణ, నిందితుల గుర్తింపు, గాలింపు చర్యలు, దర్యాప్తు నిర్వహణ, అరెస్టు ప్రక్రియలో విశేష కృషి చేసి సహకరించినట్లు ఎస్ఐ సంధ్య తెలిపారు.

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్ల పోస్టర్ విడుదల

లక్షెట్టిపేట, జూలై, 31(విజన్ ఆంధ్ర ) : డా.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్ల పోస్టర్ ను కళాశాల ప్రిన్సిపల్ డా. మహాత్మ సంతోష్ శుక్రవారం కళాశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..... అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో చేరడానికి ఆగస్టు 7 వరకు చివరి తేదీ, దూరవిద్యలో డిగ్రీ చదవాలనుకునే వారు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డా. సంతోష్ మహాత్మా మరియు ఓపెన్ యూనివర్సిటీ లెర్నర్ సపోర్ట్ సెంటర్ (స్టడీ సెంటర్) కోఆర్డినేటర్ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లక్షెట్టిపేట కేంద్రంగా నడుస్తున్న డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లెర్నర్ సపోర్ట్ సెంటర్ (స్టడీ సెంటర్) నెంబర్ 232 లో బిఏ, బీకాం అన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు, కార్మికులు, గృహిణులు చదువు మధ్యలో ఆపివేసి మళ్ళీ కొనసాగించాలని ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు ఎవరైనా డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లెర్నర్ సపోర్ట్ సెంటర్ (స్టడీ సెంటర్) నెంబర్ 232 లో డిగ్రీలో అడ్మిషన్ పొందడం ద్వారా చదువు పూర్తి చేసి డా. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సర్టిఫికెట్ పొందవచ్చు అని అన్నారు. డా. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సర్టిఫికెట్ యూజీసి గుర్తింపు పొందినది మరియు కేంద్ర మూల్యాంకన సంస్థ న్యాక్ చే గుర్తింపు పొందిన యూనివర్సిటీ. ఇందులో చదువు పూర్తి చేసిన వారు రెగ్యులర్ డిగ్రీ చదివిన వారితో సమానంగా అన్ని రకాల అవకాశాలకు అర్హులు అవుతారు. అంతేకాకుండా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వారు



డిగ్రీ పూర్తయిన తర్వాత అందించే ఉద్యోగ ప్లేస్ మెంట్ కోసం అర్హత పొందుతారు. పని చేసుకుంటూనే చదువుకునే అవకాశాన్ని ఓపెన్ యూనివర్సిటీ కల్పిస్తుంది ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. డా. బి ఆర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్ పొందడానికి యూనివర్సిటీ పోర్టల్ ద్వారా ఆన్ లైన్ లో ఆగస్టు 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 8790569436 మరియు 9032689657 చరవానిలో సంప్రదించాలని, లేదా ప్రభుత్వ డిగ్రీ కళాశాల లోని డా. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ ను అన్ని పనిదినాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు స్వయంగా సందర్శించి అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. మహాత్మా సంతోష్, కోఆర్డినేటర్ డా. తన్నీరు సురేష్ అధ్యాపకులు డా. సంతోష్ కుమార్,డా. తిరుపతి,జాడి శంకరయ్య, లైబ్రేరియన్ నాగేశ్వర్, సంధ్యారాణి,రాజ్ కుమార్,మల్లయ్య , శ్రీనివాస్,కవిత ఓపెన్ యూనివర్సిటీ బోధనేతర సిబ్బంది సత్యనారాయణ పాల్గొన్నారు.



## ఆయిల్ ఫామ్ సాగుకు రైతులను ప్రోత్సహించాలి

### - జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

పరిగి,జులై 31(విజన్ ఆంధ్ర ): ఆయిల్ ఫామ్ పంట సాగు విస్తరణకు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పరిగి మండలం సుల్తాన్‌పూర్ తండాలో ఆయిల్ ఫామ్ తోటలో సాగు చేస్తున్న అంతర్ పంటలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిగి మండలంలో 1,000 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యంగా రైతులను సన్నద్ధం చేయాలని సూచించారు. ఆయిల్ ఫామ్ పంట సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని, ఈ విషయంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే, ఆయిల్ ఫామ్ పంట కొనుగోలుకు రైతులకు సౌకర్యంగా ఉండేలా పరిశ్రమను ఏర్పాటు చేయనున్నట్లు రైతులకు తెలియజేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతుతో మాట్లాడిన కలెక్టర్, పంటకు నీటి లభ్యత, సాగులో ఎదురవుతున్న సమస్యలు, పంట అభివృద్ధిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ (ట్రైనీ) కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గాదిగూడలో ఉపాధి హామీ పథకం ఉద్యోగులు నిరసన

గాదిగూడ, జులై 31(విజన్ ఆంధ్ర ):వేతన బకాయిల విడుదలతో పాటు తమ దీర్ఘకాలిక డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని శుక్రవారం గాదిగూడ మండల ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 3నెలల వేతన బకాయిలు వెంటనే విడుదల, పేస్కెల్ అమలు, క్యాడర్ ను ఖరారు చేయడంతో పాటు సీనియారిటీ ప్రతిపదికన పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న సిబ్బందికి బదిలీ అవకాశం ఇవ్వాలని కోరారు. తమను క్రమబద్ధికరిస్తామని ఇంద్రవెల్లి సభలో మంత్రి సీతక్క ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేరలేదని ఉపాధి హామీ పథకం ఉద్యోగులు తెలిపారు. కార్యక్రమంలో వికాస్,ప్రశాంత్,అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రగ్స్, గుడుంబాకు దూరంగా ఉండాలి

### - సివిల్స్ రైట్స్ డే సందర్భంగా బుచ్చయ్యపల్లిలో అవగాహన కార్యక్రమం

బెల్లంపల్లి , జూలై 31 విజన్ ఆంధ్ర :సివిల్స్ రైట్స్ డే సందర్భంగా బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం సర్పంచ్ జాడి మహేశ్వర్ అధ్యక్షత వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ సభ్యుడు రాజనర్సు, తాళ్లగురిజాల ఎసై రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ , సమానత్వం, అంటరానితనం నిర్మూలన, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, గుడుంబా తయారీ, విక్రయాలపై అమలులో ఉన్న చట్టాల గురించి గ్రామ ప్రజలకు వివరించారు. డ్రగ్స్, గుడుంబా వంటి సామాజిక దురాచారాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జక్కుల పవన్ కళ్యాణ్, వార్డు సభ్యుడు కోల మహేష్,



మాజీ ఉపసర్పంచ్ కర్ణాటక ఓదేలు, బుడిమె ఓదేలు, మాస్ శివకృష్ణ, సాగర్ల శ్రీను, బండారు తిరుపతి, బండారి వెంకటేష్, రాణవేణి శంకరయ్య, రెవెన్యూ సిబ్బంది ఆరే రమేష్, జీపీఓ శ్రీకాంత్‌తో పాటు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాదకద్రవ్య రహిత భారతానికి యువశక్తి సంకల్పం

-ఆగస్టు 2న రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా "నషా ముక్త యువ సంకల్ప్ అభియాన్"
– దేశవ్యాప్తంగా పది వేలకుపైగా కేంద్రాల్లో యువతతో ప్రధానమంత్రి వర్చువల్ సంభాషణ
-తెలంగాణలో నాలుగు ప్రధాన కేంద్రాలు, మరో ఐదు జిల్లాల్లో ప్రత్యేక కార్యక్రమాలు
-కోటి మందికిపైగా యువతతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ
-అవగాహన ర్యాలీలు, యువజన సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు విస్తృత ఏర్పాట్లు
-విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖల సమిష్టి భాగస్వామ్యం
-మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై యువతకు చైతన్యం కల్పించడమే ప్రధాన లక్ష్యం
– వికసిత భారత లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపు

కుత్బుల్లాపూర్, జూలై 31 (విజన్ ఆంధ్ర ): మాదకద్రవ్యాల నిర్మూలనకు యువతను భాగస్వామ్యం చేస్తూ దేశాన్ని ఆరోగ్యవంతమైన, శక్తివంతమైన దిశగా నడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ తెలంగాణ ఆధ్వర్యంలో ఆగస్టు 2న రాష్ట్రవ్యాప్తంగా "నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్ -- సంకల్ప్ అభియాన్" నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. దేశవ్యాప్తంగా




చేపట్టిన ఈ జాతీయ ఉద్యమంలో భాగంగా ప్రధానమంత్రి దేశంలోని యువతతో వర్చువల్‌గా సంభాషించి, పది వేలకుపైగా కేంద్రాల్లో ఒక కోటి మందికిపైగా యువతతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే ప్రతిజ్ఞ చేయించనున్నారు. యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించి, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్నారు. తెలంగాణలో హైదరాబాద్‌లోని శ్రీనిధి విజ్ఞాన సాంకేతిక విద్యాసంస్థ, రంగారెడ్డి జిల్లాలోని సి.ఎం.ఆర్. సాంకేతిక విద్యా ప్రాంగణం, సిద్దిపేటలోని కావేరి విశ్వవిద్యాలయం, వరంగల్‌లోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్రస్థాయి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదనంగా మరో ఐదు జిల్లాల్లో జిల్లా స్థాయి కార్యక్రమాలు చేపట్టి యువత, విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సేవకులు, సామాజిక సంస్థలతో కలిసి మాదకద్రవ్య రహిత యువ ప్రతిజ్ఞ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సామూహిక ప్రతిజ్ఞ, అవగాహన ర్యాలీలు, యువజన సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై యువతకు అవగాహన కల్పిస్తూ, సమాజంలో చైతన్యం పెంపొందించేలా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా పరిపాలన, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, జాతీయ సేవా పథకం, జాతీయ కేడెట్ దళం, యువజన సంఘాలు, ప్రభుత్వ శాఖలు, ఆధ్యాత్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలతో మై భారత్ తెలంగాణ విస్తృత స్థాయిలో సమన్వయం చేపట్టింది. ఈ సందర్భంగా రాష్ట్ర సంచాలకుడు చి. అన్వేష్ మాట్లాడుతూ, మాదకద్రవ్య రహిత భారత నిర్మాణంలో యువతే ప్రధాన శక్తి అని పేర్కొన్నారు. ఈ ఉద్యమం కేవలం అవగాహన కార్యక్రమం మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే జాతీయ సంకల్పమని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి యువకుడు, ప్రతి విద్యాసంస్థ, ప్రతి ప్రభుత్వ శాఖ, ప్రతి సామాజిక సంస్థ ఆగస్టు 2న జరిగే కార్యక్రమంలో చురుకుగా పాల్గొని మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. సమిష్టి కృషి, యువశక్తి భాగస్వామ్యంతో వికసిత భారత్--2047 లక్ష్యాన్ని సాకారం చేయగలమనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కో- ఆపరేటివ్ అధికారి ఎస్.పద్మ



అందోల్ జూలై 31 (విజన్ ఆంధ్ర ప్రతినిధి)మెదక్ జిల్లా అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన మండల ప్రత్యేక అధికారి వేద ప్రకాష్ రెడ్డి జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ఎస్.పద్మ సందర్శించినారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలు, మరియు స్టాఫ్ పొజిషన్ తెలుసుకొని అన్ని గదులు ఓపి, ఫార్మసీ, ల్యాబ్, వార్డు, థియేటర్, లేబర్ రూమ్ పరిశీలించారు.వీరితో పాటు స్థానిక వైద్యాధికారి సారిక పి హెచ్ సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తోగుట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన గజ్వేల్ ఏసీపీ నర్సింలు



గజ్వేల్, 28 జూలై 2026 (విజన్ ఆంధ్ర): గజ్వేల్ ఏసీపీ నర్సింలు శుక్రవారం రోజున వార్షిక తనిఖీల్లో భాగంగా సిద్దిపేట జిల్లా తోగుట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణతో పాటు అన్ని విభాగాలను ఆయన కూలంకషంగా పరిశీలించారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, కేసు ప్రాపర్టీ, స్టేషన్ పరిసరాల్లో ఉన్న కేసు సంబంధిత వాహనాలను ఏసీపీ స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తోగుట పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సైబర్ క్రైమ్, రిసెప్షన్, కోర్టు డ్యూటీ, మరియు సీసీటీఎన్ఎస్ విభాగాల పనితీరును సమీక్షించి, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ నర్సింలు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ఫిర్యాదుదారులతో నిబద్ధతతో, గౌరవప్రదంగా మరియు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. తోగుట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే ఆర్థిక నేరాలు, దొంగతనాలు మరియు ఇతర నేరాల దర్యాప్తును ఎలాంటి పక్షపాతం లేకుండా నిష్పక్షికంగా, వేగవంతంగా పూర్తి చేయాలని తోగుట ఎస్ఐ నవీన్ మరియు స్టేషన్ సిబ్బందిని ఆదేశించారు. ఈ వార్షిక తనిఖీ కార్యక్రమంలో తోగుట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లతీఫ్, ఎస్ఐ నవీన్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



వాజేడు,జులై31(విజన్ ఆంధ్ర): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో సర్వం కోల్పోయిన చెన్నం రాజు కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బిఆర్ఎస్ వాజేడు మండల అధ్యక్షులు పెనుమల్లు రామకృష్ణారెడ్డి అన్నారు. బిఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించి, నిత్యవసర సరుకులు, 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రాజు కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, జీవనోపాధికి తక్షణ సహాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గొంది రమణ రావు, ముడిగ తిరుపతి, సాంబశివరావు, సమ్మయ్య, వెంకటేశ్వర్లు, తాతారావు, శ్రీకాంత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆషాఢ మాసంలో గ్రామ దేవతలకు పూజించేది " ఊర పండుగ "

### - ఖిల్లా నుంచి దుబ్బ వరకు రూట్ మ్యాప్ పరిశీలించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...



నిజామాబాద్ జులై31:(విజన్ ఆంధ్ర )ఆషాఢ మాసంలో గ్రామదేవతలను ప్రత్యేకంగా పూజించడం ఆనవాయితీగా వస్తుందని, ఈ రోజును ఇందూరులో ఊరపండగ గా నిర్వహిస్తామని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని ఖిలా వద్ద గల అమ్మవార్ల గద్దె నుంచి గాజులపేట్, పెద్ద బజార్ మీదుగా వెళ్లే అమ్మవార్ల రూట్ మ్యాప్ ను శుక్రవారం పరిశీలించారు. అలాగే మామిడి చెట్టుతో నిష్ఠగా చేసే దేవుళ్ళను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈ నెల 2న ఇందూరులో సర్వసమాజ్ ఆధ్వర్యంలో ఊరపండగ ఘనంగా నిర్వహిస్తున్నారని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా పూర్తి చేస్తున్నారన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని గద్దెను శ్రీ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అదనపు నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా గద్దె ఎత్తును కూడా పెంచినట్లు తెలిపారు. అలాగే గాజుల పేట లో "సరి" వద్ద ఎటువంటి తోపులాట జరగకుండా పోలీసు శాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆషాఢ మాసంలో తెలంగాణలో బోనాల పండుగ సాంప్రదాయంగా వస్తుందని గుర్తు చేశారు. ఇందూరులో అన్ని కుల సంఘాలు ఐక్యంగా నిర్వహించుకునే అతిపెద్ద పండగ ఊర పండగ అన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని గ్రామదేవతలను కొలిచే సంప్రదాయం ఇందూరులో మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో సర్వసమాజ్ కమిటీ ప్రతినిధులు బంటు రాజేశ్వర్, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, మల్కాయి మహేందర్, జగదీష్ కులకర్ణి, బంటు రాము, పసునూరి రాము, బెల్లాల్ శశాంక్, వైష్ణవి సుధా, కల్పే అర్చనా చిరంజీవి, జ్యోతి మురళి, ప్రసూన శ్రీనివాస్, ప్రీతి ప్రవీణ్, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, ప్రసన్న శ్యామల సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇటిక్యాల బాధిత రైతులకు న్యాయం చేయాలి

### - రాజలింగం

గజ్వేల్ నియోజకవర్గం, 31 జూలై 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం ఇటిక్యాల గ్రామంలో 2005 లో ప్రభుత్వం పేద రైతులకు పంచిన భూమిని తిరిగి తీసుకుంటుందని, బాధితులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారికి నర్సోళ్ల రాజలింగం వార్డు మెంబర్ తుమ్మ బాబు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనెంబర్ 272 లో ఒక ఎకరం చొప్పున సుమారు 250 మంది రైతులకు భూమిని పంచిందన్నారు. పట్టా సర్టిఫికెట్లు, పాస్ బుక్కులు, ప్రొసీడింగ్స్ ప్రభుత్వం ఇవ్వడం జరిగిందన్నారు. 20 సంవత్సరాల క్రితం ఇచ్చిన భూమిని పేద రైతుల దగ్గర నుండి అన్యాయంగా తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామంలో భూమిలేని పేదలకు ఇచ్చిన భూమిని తిరిగి ప్రభుత్వం ఎలాంటి న్యాయం చేయకుండా తీసుకోవడం ఇది హేయమైన చర్య ప్రభుత్వ స్పందించి పేద రైతులందరికీ ఆదుకుని వారికి తగిన న్యాయం చేయాలని కోరారు.



## కుత్బుల్లాపూర్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై రాజకీయ పార్టీలతో కీలక సమావేశం

- ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై రాజకీయ పార్టీలకు అవగాహన
- కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలపై విస్తృత చర్చ
- పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సూచనలు ఇవ్వాలని అధికారుల విజ్ఞప్తి
- పోలింగ్ కేంద్రాల స్థల మార్పు అవసరమైతే కారణాలతో ప్రతిపాదనలు సమర్పించాలని సూచన
- పారదర్శక, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణే లక్ష్యమని అధికారుల స్పష్టం
- సమావేశంలో పాల్గొన్న ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు




గాజులరామారం, జూలై 31 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ శాసనసభ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం సర్కిల్‌లో శుక్రవారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి సంబంధించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, అవసరమైన చోట పోలింగ్ కేంద్రాల స్థల మార్పు తదితర అంశాలపై అధికారులు సమగ్రంగా చర్చించారు. పోలింగ్ కేంద్రాలను ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా హేతుబద్ధీకరించేందుకు రాజకీయ పార్టీల సహకారం అవసరమని అధికారులు పేర్కొన్నారు. ఏదైనా పోలింగ్ కేంద్రాన్ని వేరే ప్రాంతానికి మార్చాల్సిన అవసరం ఉన్నా, లేదా కేంద్రంలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు సంబంధించి సూచనలు ఉన్నా, వాటిని సరైన కారణాలతో లిఖితపూర్వకంగా సమర్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పూర్తిస్థాయి పారదర్శకతతో, నిష్పాక్షికంగా నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు రాజకీయ పార్టీల సూచనలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గాజులరామారం సహాయ ఎన్నికల నమోదు అధికారి, ఉప కమిషనర్ యు. వెంకటరాములు, ఎన్నికల పర్యవేక్షణ అధికారి బి. బాలకృష్ణ, అలాగే వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. అధికారులు వాటిని పరిశీలించి ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పోలీసు కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్‌లలో రేగోడ్ మండల యువత సత్తా చాటాలి

- క్రమశిక్షణతో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి
- మండల ప్రధాన కార్యదర్శి సుంకే రమేష్



మెదక్/రేగోడ్ జూలై 31(విజన్ ఆంధ్ర) : తెలంగాణ పోలీసు కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్ రాష్ట్ర యువతకు ఒక గొప్ప అవకాశం. ఈ అవకాశాన్ని ప్రతి యువకుడు, యువతి సద్వినియోగం చేసుకోవాలని రేగోడ్ మండల బిఆర్ఎస్ పార్టీ ప్రధాన సుంకే రమేష్ తెలిపారు. పోటీని భయపడకుండి పట్టుదలతో ముందుకు సాగండి. కష్టానికి ప్రతిఫలం తప్పకుండా వస్తుందని అన్నారు. రేగోడు మండలంలోని అన్ని గ్రామాల విద్యార్థులు, నిరుద్యోగ యువత ఉద్యోగ లక్ష్యసాధనే ధ్యేయంగా పెట్టుకుని క్రమశిక్షణతో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి. ప్రతి రోజు ప్రణాళికాబద్ధంగా చదువుతూ శారీరక దృఢత్వాన్ని కూడా పెంపొందించుకోవాలి. విజయం అదృష్టంతో కాదు, నిరంతర శ్రమతో వస్తుంది. మన రేగోడు మండలం నుండి అత్యధిక మంది పోలీసు ఉద్యోగాలకు ఎంపికై, మన మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

# 23 ఏళ్ల సేవలకు ఘన వీడ్కోలు

- డీఆర్‌డీఏ--సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ కొమ్ము మల్లేశంకు భావోద్వేగ సన్మానం
- 23 సంవత్సరాలపాటు వివిధ జిల్లాల్లో విశిష్ట సేవలు
- డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో ఘనంగా పదవీ విరమణ సన్మాన సభ
- సెర్ప్ ఉద్యోగుల సంఘం, జిల్లా సమాఖ్య ప్రతినిధుల ఘన సన్మానం
- అధికారులు, సిబ్బంది, ఆర్పీలతో సందడిగా వీడ్కోలు కార్యక్రమం
- కుటుంబ సభ్యులతో కలిసి మల్లేశంను ఇంటివరకు చేర్చిన డీఆర్‌డీఓ
- సేవా నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనమని కొనియాడిన పలువురు



కుత్బుల్లాపూర్ జూలై 31 (విజన్ ఆంధ్ర); డీఆర్‌డీఏ--సెర్ప్‌లో కమ్యూనిటీ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహించిన కొమ్ము మల్లేశం శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు డీఆర్‌డీఏ కార్యాలయంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డీఆర్‌డీఓ అధ్యక్షత వహించి మల్లేశం అందించిన విశిష్ట సేవలను కొనియాడుతూ ఘనంగా సన్మానించారు. కొమ్ము మల్లేశం గత 23 సంవత్సరాలుగా డీఆర్‌డీఏ--సెర్ప్‌లో వివిధ జిల్లాల్లో పనిచేస్తూ గ్రామీణ పేదరిక నిర్మూలన, మహిళా సంఘాల బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో విశేష సేవలందించారు. ఆయన నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావం అందరికీ ఆదర్శంగా నిలిచాయని పలువురు వక్తలు ప్రశంసించారు. సన్మాన కార్యక్రమంలో సెర్ప్ ఉద్యోగుల సంఘం బాధ్యులు, జిల్లా సమాఖ్య సిబ్బంది, డీపీఎంలు, ఏపీఎంలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, అకౌంటెంట్లు, ఆర్పీలు, డీఆర్‌డీఏ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మల్లేశంకు శాలువా కప్పి, జ్ఞాపికలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి అధికారి సాంబశివరావు, టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు వినోద్, జిల్లా సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి తదితరులు మాట్లాడుతూ మల్లేశం తన ఉద్యోగ జీవితంలో ఎంతో అంకితభావంతో సేవలందించారని, ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం డీఆర్‌డీఓ స్వయంగా మల్లేశం, ఆయన కుటుంబ సభ్యులను తన అధికారిక వాహనంలో వారి నివాసానికి చేర్చడం సభలోని అందరినీ భావోద్వేగానికి గురిచేసింది. అధికారుల ఆప్యాయత, సహచర ఉద్యోగుల అభిమానానికి ఈ సంఘటన నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య ప్రతినిధులు, డీపీఎంలు, ఏపీఎంలు, మండల కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, అకౌంటెంట్లు, ఆర్పీలు, సెర్ప్ ఉద్యోగులు, డీఆర్‌డీఏ సిబ్బంది తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్ జులై31: (విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలోని వంతెనల అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ కోరారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ని గురువారం రాత్రి ఢిల్లీలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తో కలిసి ప్రతిపాదనలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని దేవీ రోడ్డు - నాందేవాడ (ఆర్ వోబీ) అదనపు వంతెన మంజూరు చేయాలని కోరడం జరిగిందన్నారు. ప్రధానంగా ఈ రైల్వే లైను దాటడానికి విజయ థియేటర్, అలాగే నాందేవాడ వద్ద రెండు మార్గాలు మాత్రమే ఉన్నాయన్నారు. రద్దీ ఎక్కువగా కావడంతో ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదని, కావున నూతన ఆర్ వోబీ మంజూరు చేయాలన్నారు. అలాగే ఎల్లమ్మగుట్ట వద్ద సోనీ ఫంక్షన్ హాల్ సమీపంలో మరొక ఆర్ యూబీ అత్యంత ఆవశ్యకమన్నారు. ఇందుకోసం రూ.170 కోట్లు మంజూరుకావాలన్నారు.

# ఊరపండుగ ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన

నిజామాబాద్ జులై31:( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలో ఆదివారం నిర్వహించనున్న ఇందూరు నగర ఊరపండుగ నేపథ్యంలో గౌరవనీయులు నిజామాబాదు పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్., శుక్రవారం ప్రత్యేకంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను సమీక్షించారు.
ముందుగా నగరంలోని ఊరపండుగలో ప్రతిష్ఠించనున్న అమ్మవార్ల విగ్రహాల తయారు చేస్తున్న ప్రాంతాలను , రహదారులను ఆయన పరిశీలించారు. కళాకారులతో మాట్లాడి విగ్రహాల తయారీ పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి ఊరపండుగ శోభాయాత్ర నిర్వహించే మార్గాన్ని పరిశీలిస్తూ భద్రత , ట్రాఫిక్ నియంత్రణ , బారికేడింగ్ , ప్రజల రాకపోకల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. తదనంతరం సిర్పల్లి గడికి చేరుకుని అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వసమాజ సమితి సభ్యులతో సమావేశమై ఊరపండుగ నిర్వహణ , భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు , శాంతిభద్రతల అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఊరపండుగను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు.



ఈ పర్యటనలో నిజామాబాదు ఏసీపీ శ్రీ ప్రకాశ్ యాదవ్ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీ శ్రీధర్ రెడ్డి , శ్రీ మలేష్ , నిజామాబాద్ టౌన్ సిఐ శ్రీ శ్రీనివాసరాజ్ , టౌన్ 1 ఎస్.హెచ్.ఓ శ్రీ రఘుపతి , రూరల్ ఎస్ హెచ్ ఓ శ్రీ శ్రీనివాస్ , టౌన్ 4 ఎస్ హెచ్ ఓ శ్రీ సతీష్ , టూ టౌన్ ఎస్ఐ శ్రీ యాదగిరి గౌడ్ , సర్వ సమాజ్ కన్వీనర్ శ్రీ రామర్తి గంగాధర్ , కార్యదర్శి శ్రీ బంటు రాజేశ్వర్ సభ్యులు మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

# సిబియల్ పరిశ్రమ కాంట్రాక్ట్ కార్మికులకు రెగ్యులర్ పని దినాలు కల్పించాలి

-- అర్ధాంతరంగా ఉత్పత్తి ఆపేస్తే కార్మికుల బ్రతుకుతెరువెట్లా?
-- పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన... అధికారులు స్పందించి న్యాయం చేయాలి
-- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

చౌటకూర్ జూలై 31 (విజన్ ఆంధ్ర) : చౌటకూర్ మండలం శివంపేట గ్రామ పరిధిలోని 'సిబియల్' (జడీూ) పరిశ్రమలో గడిచిన కొన్నేళ్లుగా వందలాది మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. అయితే పరిశ్రమ యాజమాన్యం అర్ధాంతరంగా ఉత్పత్తులను నిలిపివేయడంతో కార్మికులంతా రోడ్డున పడ్డారని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పరిశ్రమ వద్ద కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ... జాతీయ రహదారి విస్తరణ సమయంలో కంపెనీ ముందు సహజసిద్ధంగా వర్షపునీరు వెళ్ళే దారి (నేచురల్ డ్రైన్) మూసుకుపోయిందన్నారు. దీనివల్ల వర్షం పడినప్పుడు లోతట్టు ప్రాంతంలో ఉన్న కంపెనీలోకి జాతీయ రహదారి పైనుండి నీరు వచ్చి చేరుతోందని, ఆ నీటిని మోటార్ల ద్వారా యాజమాన్యం బయటకు పంపుతోందని వివరించారు.
అయితే కొందరు ఉద్దేశపూర్వకంగా కలుష్య నీటిని నదిలో కలుపుతున్నారని ఫిర్యాదు చేయగా, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు పూర్తిస్థాయి విచారణ జరపకుండానే షోకాజ్ నోటీసు ఇచ్చారని మండిపడ్డారు. దీంతో యాజమాన్యం తాత్కాలికంగా ఉత్పత్తులను నిలిపివేసిందని, ఫలితంగా కార్మికులకు పని లేకుండా పోయిందని విమర్శించారు. 2000 కుటుంబాల ఉపాధిపై దెబ్బ ఇప్పటికే కంపెనీలో సరైన ఉత్పత్తి లేక కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు కేవలం 15 రోజులే పని దొరుకుతోందని, ఇప్పుడు ఆ పని కూడా పోవడంతో కంపెనీపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడ్డ సుమారు 2,000 మంది ఉపాధి దెబ్బతిన్నదని అన్నారు. ఒకవేళ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను బయటకు వదిలితే జిల్లా యంత్రాంగం చట్ట ప్రకారం కంపెనీపై చర్యలు తీసుకోవాలని, అంతేతప్ప కార్మికుల బ్రతుకుతెరువును ఎందుకు దెబ్బతీస్తున్నారని ప్రశ్నించారు. కంపెనీలో వ్యర్థ జలాలను శుద్ధి చేయడానికి అవసరమైన ప్లాంట్ (జుూ) అందుబాటులోనే ఉందని, శుద్ధి చేసిన నీటిని యంత్రాల క్లీనింగ్, గార్డెనింగ్ మరియు వాష్‌రూమ్‌లకు ఉపయోగిస్తున్నారని తెలిపారు. మిగిలిన వ్యర్థ జలాలను ట్యాంకర్ల ద్వారా పటాన్‌చెరులోని ప్లాంట్‌కు తరలిస్తున్నారని, కేవలం వర్షం వచ్చినప్పుడు మాత్రమే వర్షపు నీటిని బయటకు పంప్ చేస్తున్నారని స్పష్టం చేశారు. డిమాండ్లు:అధికారులు తక్షణమే స్పందించి కార్మికులకు ఉపాధి కోల్పోకుండా ఉద్యోగ భద్రత కల్పించాలి. వర్షం నీరు కంపెనీలోకి రాకుండా, బయటకు వెళ్లడానికి అవసరమైన సహజ డ్రైనేజీ దారిని పునరుద్ధరించాలి. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి. మల్లేశం, ఉపాధ్యక్షులు ఎ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి. భాగారెడ్డి, ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ ప్రసన్న రావు, కాంట్రాక్టు కార్మికుల యూనియన్ జనరల్ సెక్రటరీ సురేష్, ఇతర నాయకులు, పర్మనెంట్ మరియు కాంట్రాక్ట్ కార్మికులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అధికారిక లాంఛనాల నడుమ అంతిమ వీడ్కోలు



నల్లబెల్లి, జూలై 31(విజన్ ఆంధ్ర):నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమ యోధుడు పెద్ది సుదర్శన్ రెడ్డికి శుక్రవారం స్వగ్రామంలో అధికారిక లాంఛనాల నడుమ అశ్రునయనాలతో తుది వీడ్కోలు పలికారు. నర్సంపేట నుంచి నల్లబెల్లి వరకు సాగిన అంతిమయాత్రలో వేలాది మంది ప్రజలు, అభిమానులు పాల్గొని కన్నీటి నివాళులర్పించారు. పలువురు రాజకీయ ప్రముఖులు ఆయన భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించగా, అనంతరం కుటుంబ సభ్యులు స్వంత వ్యవసాయ క్షేత్రంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమంలో, ప్రజాసేవలో ఆయన చేసిన సేవలను నాయకులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

## పేకట స్థావరంపై దాడి,8 మంది అదుపులోకి

**- ఎస్సై శేఖర్ గౌడ్**



గట్టు: జూలై 31( విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం బోయలగూడెం గ్రామ శివారులో అక్రమంగా పేకాట ఆడుతున్న వారిపై, పోలీస్ బృందంతో,దాడి నిర్వహించారు.
ఈ దాడిలో మొత్తం 08 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 06 మొబైల్ ఫోన్లు,10 మోటార్ సైకిళ్లు రూ.44,110 నగదును, స్వాధీనం చేసుకున్నాము అని గట్టు మండలం ఎస్సై శేఖర్ గౌడ్ తెలియపరచారు.

# పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

**- సీపీఎం నాయకులు హన్మంత్**

**- జటప్రోలు గ్రామసభలో ప్రజా సమస్యలపై సీపీఎం వినతిపత్రం**



పెంట్లవెల్లి జూలై 31 : (విజన్ ఆంధ్ర) : పెంట్లవెల్లి మండలం, జటప్రోలు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో సీపీఎం నాయకులు హన్మంత్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై గ్రామపంచాయతీ సర్పంచ్ సులిగిరి పద్మ కృష్ణయ్య కి, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా సీపీఎం నాయకులు హన్మంత్ మాట్లాడుతూ, గ్రామంలో సైడ్ కాలువలు లేకపోవడంతో డ్రైనేజీ నీరు రోడ్లపై ప్రవహిస్తూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. అలాగే ముందే వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా పలు కాలనీల్లో వెంటనే బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ఆయన కోరారు.
అదేవిధంగా వంగిపోయిన, దెబ్బతిన్న వీధి విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని, పనిచేయని హైమాస్ట్ లైట్లను వెంటనే మరమ్మతు చేయాలని ,అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రతా పెన్షన్లు అందేలా చూడడం అధికారుల నైతిక బాధ్యత అని పేర్కొన్నారు. అలాగే రాజకీయ పార్టీ లకు అతీతంగా నిజమైన అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ పంచాయతీ కార్యదర్శికి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.
ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామ సభకు హాజరైన గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ జానపద నృత్య కళాకారుడు, డాన్స్ మాస్టర్ ఆకస్మిక మరణం కళారంగానికి తీరని లోటు

అక్కన్నపేట, జూలై 31 (విజన్ ఆంధ్ర) : ప్రముఖ జానపద నృత్య కళాకారుడు, డాన్స్ మాస్టర్ రొంటాల కుమార్ (కుమారి) ఆకస్మిక మరణం కళారంగానికి తీరని లోటని టీవీ, రేడియో జానపద గాయకుడు గడిపె మల్లేశ్ పేర్కొన్నారు.
చిన్నతనం నుంచే గ్రామీణ జానపద కళలపై ఆసక్తి పెంచుకున్న రొంటాల కుమార్, సీనియర్ రంగస్థల కళాకారులు సిర్సపల్లి లింగమూర్తి, హుస్నాబాద్‌కు చెందిన నాట్యరత్న రజనీశ్రీ, గోదావరిఖనికి చెందిన శ్రీరాముల సీతారామరాజు వద్ద శిక్షణ పొందారు. అనంతరం హుజురాబాద్‌కు చెందిన డాన్స్ మాస్టర్ బోరంగాల అజయ్ (రేవతి)తో కలిసి స్త్రీ వేషధారణలో కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అనేక జానపద నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.
జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచార కార్యక్రమాల్లో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వార్షికోత్సవాల్లో వేలాది మంది విద్యార్థులకు నృత్య శిక్షణ అందించి, అనేక కళాప్రదర్శనల్లో పాల్గొని జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రశంసలు అందుకున్న గొప్ప జానపద కళాకారుడిగా రొంటాల కుమార్ గుర్తింపు పొందారని గడిపె మల్లేశ్ తెలిపారు.
2024లో హుస్నాబాద్‌లో ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి చేతుల మీదుగా "ఉత్తర తెలంగాణ ఉద్యమ ఉత్తమ కళాకారుల అవార్డ్"ను రొంటాల కుమార్ అందుకున్నారని గుర్తు చేశారు. గురువారం ఆయన ఆకస్మిక మరణం కళాకారులను తీవ్ర విషాదంలో ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు.
శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న రొంటాల కుమార్ నివాసానికి వెళ్లిన గడిపె మల్లేశ్, పలువురు కళాకారులతో కలిసి భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బోరంగాల అజయ్ కుమార్ (రేవతి), తెలంగాణ ప్రజా నాట్య మండలి కళాకారులు బత్తుల బాబు, కొరెపు చిట్టి తదితరులు పాల్గొన్నారు. అనంతిమయాత్రలో వందలాది మంది కళాకారులు, కుటుంబ సభ్యులు, కళాభిమానులు, కళాపోషకులు, హుస్నాబాద్ ప్రాంత కళాకారులు పాల్గొని రొంటాల కుమార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు

# ప్రతి అర్హ ఓటును కాపాడటమే కాంగ్రెస్ లక్ష్యం

**- ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి**

**- బీజేపీ రాజ్యాంగబద్ధ సంస్థలను ప్రభావితం చేస్తోంది --**

**- SIRలో అప్రమత్తంగా ఉండాలి**

**- బీజేపీ, బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపు**

**- మోదీ హటావో -- దేశ్ కో బచావో నినాదం ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**- జిల్లాస్థాయి ఎస్ఐఆర్ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డితో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే**



నిజామాబాద్ జులై31:( విజన్ ఆంధ్ర ) ఆర్మూర్ మండలం మామిడిపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన నిజామాబాద్ జిల్లా స్థాయి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సమావేశంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డితో కలిసి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా పార్టీ నాయకులు, బీఎల్ఏ ఏజెంట్లు, సూపర్వైజర్లు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.దేశంలో రాజ్యాంగబద్ధ సంస్థలను బీజేపీ ప్రభుత్వం ప్రభావితం చేస్తోందని ఆరోపించిన ఎమ్మెల్యే, అందువల్లే కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక చొరవతో ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియను నిశితంగా పరిశీలిస్తూ ప్రతి అర్హ ఓటును కాపాడేందుకు కృషి చేస్తోందన్నారు. బీహార్, బెంగాల్‌లో జరిగినట్లుగా ఓట్ల గల్లంతు లేదా అక్రమాల పరిస్థితి తెలంగాణలో తలెత్తకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.
ఇప్పటి వరకు జరిగినది కేవలం ప్రాథమిక సవరణ మాత్రమేనని, ఇక నుంచి అసలు బాధ్యత ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో అర్హుల పేర్లు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పరిశీలించాలని, దొంగ ఓట్లపై అభ్యంతరాలు నమోదు చేయాలని సూచించారు. తుది ఓటర్ల జాబితా వెలువడే వరకు పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, ఒక్క అర్హ ఓటు కూడా కోల్పోకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు.
ఈ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేస్తున్న బీఎల్ఏ ఏజెంట్లు, సూపర్వైజర్ల సేవలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.
ఇటీవల యువతకు సంబంధించిన అంశాల్లో బీజేపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరును ప్రజలు గమనించారని, యువతకు మద్దతుగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనకు స్పందనగా ఆయనను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు.
రాహుల్ గాంధీకి మద్దతుగా పార్టీ శ్రేణులు నిర్వహించిన ధర్నాలు అభినందనీయమని పేర్కొన్నారు. యువతకు కాంగ్రెస్ అండగా నిలవడం వల్లే కేంద్ర మంత్రిని రాజీనామా చేయించగలిగామని వ్యాఖ్యానించారు.
రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చూడాలనే లక్ష్యంతో పార్టీ శ్రేణులు కృషి చేయాలని, "మోదీ హటావో -- దేశ్ కో బచావో" నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ, బడా కార్పొరేట్ వర్గాలకు మాత్రమే అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు.
సాగునీటి ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కారణంగానే నేడు ఈ పరిస్థితులు వచ్చాయని విమర్శించారు.
తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం జరిగి ఉంటే ప్రస్తుతం కరవు పరిస్థితులు ఉండేవి కావని అన్నారు. డ్యాములు నిర్మించిన తర్వాత కూడా నదుల నుంచి పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తామని చెప్పడం బీఆర్ఎస్ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ ఇంచార్జి వినయ్ రెడ్డి, బాల్కొండ,బోధన్, నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల ఎస్ఐఆర్ ఇంచార్జి లు , ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, రాష్ట్ర గీతా పారిశ్రామిక కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని 7 మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రధాన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పూజారి సలేశ్వరం మృతి..

**- పార్థివదేహానికి నివాళి అర్పించిన మాజీ జెడ్పిటిసి, పి విశ్వేశ్వర్**

కొత్తకోట జులై 31 (విజన్ ఆంధ్ర) : కొత్తకోట మండలంలోని సంకిరెడ్డి పల్లి గ్రామ ఆంజనేయ స్వామి దేవాలయ పూజారి సలేశ్వరం అకస్మాత్తుగా మృతి చెందగా.. విషయం తెలుసుకున్న మాజీ జడ్పిటిసి పొగాకు విశ్వేశ్వర్ పూజారి సలేశ్వరం మృతదేహానికి పూలమాల సమర్పించి నివాళి అర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులకు పరామర్శించి ఆర్థిక సాయం చేసి మనోధైర్యం ఇచ్చారు. మాజీ జెడ్పిటిసి పొగాకు విశ్వేశ్వర్ గారి వెంట..ఆ గ్రామ మాజీ సర్పంచ్ శివరాజు,దీ-నా నాయకులు గోపి,నరసింహ గౌడ్,రాములు,లక్ష్మన్న గారి రవీందర్ రెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొని నివాళి అర్పించారు.

## లింగంపేట గ్రామసభలో ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి అభివృద్ధి పనులకు శ్రీకారం: సర్పంచ్ బాలు

**- రోడ్లపై అడ్డంకులు తొలగింపు**
**- నల్లకుంట తండా రాకపోకలకు మార్గం**
**- ప్రజా సమస్యలకు తక్షణ స్పందన**
**- గ్రామాభివృద్ధే లక్ష్యమన్న సర్పంచ్**

జడ్చర్ల, జులై 31,(విజన్ ఆంధ్ర): జడ్చర్ల మండలం లింగంపేటలో సర్పంచ్ బాలు నేతృత్వంలో గ్రామసభ జరిగింది. ఈ సభలో స్థానికులు తమ గోడును విన్నవించారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలపై సర్పంచ్ బాలు తక్షణమే స్పందించారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన రెండు కీలక పనులను అక్కడికక్కడే ప్రారంభించారు. రోడ్లపై అడ్డంగా ఉన్న చెట్ల తొలగింపు వాహబ్ ఇంటి నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిపై చెట్ల కొమ్మలు విరివిగా పెరిగి వాహనదారులకు, విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఈ సమస్యపై ఫిర్యాదు రాగానే సిబ్బందితో రోడ్డును శుభ్రపరిచి, కొమ్మలను తొలగించే పనులు చేయించారు. నల్లకుంట తండా రహదారి మరమ్మతులు లింగంపేట నుంచి నల్లకుంట తండాకు వెళ్లే మార్గంలోని వాగు వద్ద భారీ వర్షాలకు మట్టి కొట్టుకుపోయింది. దీనివల్ల స్కూల్ బస్సులు నడవక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ బాలు వెంటనే మట్టి పోయించి, డోజర్ తో సమం చేయించారు. దీంతో రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్ బాలు మాట్లాడుతూ గ్రామంలో ఎవరికి ఏ సమస్య ఉన్నా వెంటనే పరిష్కరిస్తాం. ప్రజా సంక్షేమమే మా ప్రధాన ఎజెండా అని తెలిపారు. ఈ గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి ఇమ్రాన్, ఉప సర్పంచ్ గోపి నాయక్, వార్డు సభ్యులు రాజేష్, హబీబా, బెల్లం మల్లేష్, అమృత, రామనోళ్ల విక్టర్ తో పాటు మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

లింగోపాల్ పేట్ జూలై 31(విజన్ ఆంధ్ర): మండల కేంద్రానికి చెందిన పూసల లక్ష్మీ నారాయణ (50) కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోపాల్ పేట్ లో (1993-94) పదో తరగతి బ్యాచ్ బాల్య మిత్రులు తమ వాట్సప్ వేదికగా ఒకరికొకరు చర్చించుకుని తోచిన ఆర్థిక సహాయం అందించారు. ఇలా సమకూర్చిన 50,000 రూపాయలను లక్ష్మీ నారాయణ భార్య , కుటుంబ సభ్యులకు శుక్రవారం మండల కేంద్రంలోని మృతుని నివాసంలో అందజేశారు. మృతుని భార్య, కుమారుడు, కుమార్తె లను పరామర్శించి మన ధైర్యాన్ని కల్పించారు భవిష్యత్తులో కూడా తమవంతుగా సహాయం చేస్తామని భరోసా ను ఇచ్చారు. స్నేహితుని కుటుంబానికి అండగా నిలవడంతో పలువురు వీరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు వేణు గోపాల్, లక్ష్మీపతి, కవి, శ్రీనివాసులు, సాజిద్, కురుమయ్య, అంజిబాబు, తదితరులు ఉన్నారు.

# ఆగస్టు 3లోపు ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ పూర్తి చేయాలి

**- బీఎల్‌వోలు, బీఎల్ఏలతో మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ సమీక్ష**



కల్వకుర్తి (విజన్ ఆంధ్ర), జూలై 31: కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పట్టణంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ బీఎల్‌వోలు, బీఎల్ఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఓటర్ల వివరాల డిజిటలీకరణతో పాటు ద్వంద్వ ఓట్లు, మరణించిన వ్యక్తుల ఓట్ల తొలగింపు ప్రక్రియ ఇప్పటివరకు 95 శాతం పూర్తైందని తెలిపారు. మిగిలిన ఐదు శాతం పనులను పూర్తి చేసేందుకు కేవలం మూడు రోజుల గడువు మాత్రమే ఉందని, ఆగస్టు 3లోపు వంద శాతం పూర్తి చేయాలని బీఎల్‌వోలకు ఆదేశాలు జారీ చేశారు.
ఇంకా తమ ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత బీఎల్‌వోలకు అందజేయని వారు వెంటనే పూర్తి వివరాలతో సమర్పించి తమ ఓటును డిజిటలీకరణ చేయించుకోవాలని ఆయన కోరారు. ఫారం సమర్పించకపోయినా, అవసరమైన వివరాలు నమోదు చేయించకపోయినా ఓటరు జాబితాలో పేరు తొలగిపోయే అవకాశం ఉందని ప్రజలను అప్రమత్తం చేశారు.
పట్టణ ప్రజలందరూ తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు ఆలస్యం చేయకుండా సంబంధిత బీఎల్‌వోను సంప్రదించి ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, బీఎల్‌వోలు, బీఎల్ఏలు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి తెలంగాణకు తీరని లోటు

**- గోలి శ్రీనివాస్ రెడ్డి సంతాపం**

కల్వకుర్తి (విజన్ ఆంధ్ర), జూలై 31: తెలంగాణ ఉద్యమ సహచరుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి కోలుకుని తిరిగి ప్రజల మధ్యకు వస్తారనే ఆశతో ఎదురుచూశామని, కానీ ఆయన మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు.
తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. ఉద్యమ ఆశయాలను విశ్వసిస్తూ జీవితాంతం ప్రజల పక్షాన నిలబడి, భారత రాష్ట్ర సమితి పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా ఆయన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.
పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం భారత రాష్ట్ర సమితి పార్టీకి మాత్రమే కాకుండా తెలంగాణ సమాజానికే తీరని లోటని గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆయన చూపిన నిబద్ధత, ఉద్యమ స్ఫూర్తి, ప్రజాసేవ పట్ల ఉన్న అంకితభావం పార్టీ శ్రేణులకు, భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు.
పెద్ది సుదర్శన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, పార్టీ కార్యకర్తలకు గోలి శ్రీనివాస్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ప్రభుత్వ పథకాలు--సామాజిక అంశాలపై అవగాహన సదస్సు



గద్వాల జూలై 31 ( విజన్ ఆంధ్ర) : గద్వాల మండలం శెట్టి ఆత్మకూరు గ్రామంలో ఆపరేషన్ మెర్సి ఇండియా ఫౌండేషన్ (ఓఎంఐఎఫ్) ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు, సామాజిక అంశాలపై అవగాహన సదస్సును సర్పంచ్ భాగ్యలక్ష్మి తో కలిసి ఓఎంఐఎఫ్ మండల కోఆర్డినేటర్లు వి. అనురాధ, పౌల్, నిర్వహించారు.
ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు వివిధ ప్రభుత్వ పథకాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ముఖ్యంగా లేబర్ కార్డుల ప్రాముఖ్యత, వాటి ద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు.అలాగే సమృద్ధి సంయోజన ఇన్సూరెన్స్ పథకం గురించి ప్రజలకు తెలియజేశారు.ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలను వారు వివరించారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వ పథకాలు పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని సూచించారు. ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

# డెంగ్యూ, మలేరియా పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి

**- డ్రై డే కార్యక్రమంలో వడ్డేపల్లి మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి, చైర్మన్ మంజుల ధర్మ**

వడ్డేపల్లి : జూలై 31 (విజన్ ఆంధ్ర పత్రిక) : జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రజారోగ్య పరిరక్షణతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ లక్ష్యంగా వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలో "డ్రై డే" కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు, ప్రజలకు డెంగ్యూ, మలేరియా నివారణ, దోమల నియంత్రణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. "డ్రై డే"లో భాగంగా ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, కూలర్లు, డ్రమ్‌లు, బకెట్లు, పూల కుండీలు, పాత టైర్లు తదితర వాటిలో దోమల లార్వా పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.
అదేవిధంగా వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, భూగర్భ జలాల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా వార్డులోని మురికి కాలువలను శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.
7వ వార్డు కౌన్సిలర్ విజయభాస్కర్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ పంపును మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ గారి చేతుల మీదుగా ప్రారంభించారు. వార్డులో గడ్డి నివారణ, పారిశుద్ధ్య నిర్వహణకు ఈ పంపు ఉపయోగపడుతుందని తెలిపారు.
ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన వడ్డేపల్లిని నిర్మించగలం. డెంగ్యూ, మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపాలిటీ విజ్ఞప్తి చేసింది.
ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి మున్సిపల్ కమిషనర్ అశోక రెడ్డి,మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ, 3 వ వార్డ్ వార్డు కౌన్సిలర్ చిన్నబాబు,7 వ వార్డ్ కౌన్సిలర్ విజయభాస్కర్, 10 వ వార్డ్ కౌన్సిలర్ తిమ్మప్ప, మున్సిప ల్ అధికారులు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.




## 'నేరాల నివారణకు కృషి చేయాలి' - ఏసీపీ కిరణ్ కుమార్

మందమర్రి, జూలై 31 (విజన్ ఆంధ్ర): ప్రజలతో మమేకమై నేరాల నివారణకు పోలీసులు కృషి చేయాలని బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం మందమర్రి పోలీస్ స్టేషన్‌ను ఏసీపీ తనిఖీ చేశారు. స్టేషన్లో నమోదైన కేసుల వివరాలతో పాటు సంబంధించిన ఫైల్ రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదులు, కేసులను పెండింగ్లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. సిబ్బంది విధులను నిరంతరం పర్యవేక్షిస్తూ, సమర్ధవంతంగా పనిచేసేలా చొరవ చూపాలని సీఐ పర్శ రమేష్,ఎస్సై గోపతి నరేష్ లకు సూచించారు.

## విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి



మందమర్రి, జూలై 31 (విజన్ ఆంధ్ర): స్థానిక రవీంద్రఖని రైల్వే స్టేషన్ లోని ఒకటి,రెండు ఫ్లాట్ ఫామ్ లపై విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని డివిజనల్ రైల్వే మెంబర్ అనుమాస శ్రీనివాస్ (జీన్స్) సంబంధిత అధికారులను శుక్రవారం కోరారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి సీనియర్ సెక్షన్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ రతన్ కు శ్రీనివాస్ వినతి పత్రాన్ని అందించారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

## తోగుట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన గజ్వేల్ ఏసీపీ నర్సింలు



గజ్వేల్, 31 జూలై 2026 (విజన్ ఆంధ్ర): గజ్వేల్ ఏసీపీ నర్సింలు శుక్రవారం రోజున వార్షిక తనిఖీల్లో భాగంగా సిద్దిపేట జిల్లా తోగుట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణతో పాటు అన్ని విభాగాలను ఆయన కూలంకషంగా పరిశీలించారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, కేసు ప్రాపర్టీ, స్టేషన్ పరిసరాల్లో ఉన్న కేసు సంబంధిత వాహనాలను ఏసీపీ స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తోగుట పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సైబర్ క్రైమ్, రిసెప్షన్, కోర్టు డ్యూటీ, మరియు సీసీటీఎన్ఎస్ విభాగాల పనితీరును సమీక్షించి, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ నర్సింలు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ఫిర్యాదుదారులతో నిబద్ధతతో, గౌరవప్రదంగా మరియు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. తోగుట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే ఆర్థిక నేరాలు, దొంగతనాలు మరియు ఇతర నేరాల దర్యాప్తును ఎలాంటి పక్షపాతం లేకుండా నిష్పాక్షికంగా, వేగవంతంగా పూర్తి చేయాలని తోగుట ఎస్ఐ నవీన్ మరియు స్టేషన్ సిబ్బందిని ఆదేశించారు. ఈ వార్షిక తనిఖీ కార్యక్రమంలో తోగుట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లతీఫ్, ఎస్ఐ నవీన్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## చిత్తూరు ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం సరైందికాదు

చిత్తూరు జూలై 31 విజన్ ఆంధ్ర ప్రతినిధి చిత్తూరు ఎమ్మెల్యే పై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకులు పై ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు షణ్ముగం సవాలు ఇచ్చారు చిత్తూరు ఎమ్మెల్యే రాజకీయంగాను ప్రజల మన్ననలు పొందుతున్న వ్యక్తిని దెబ్బతీయాలని కర్ణాటక రాష్ట్రంలోని సోషల్ మీడియాతో కుమ్మక్కై లేనిపోని కల్పిత వార్తలు రాసి నిస్వార్థంతో పాలన సాగిస్తున్న మా ఎమ్మెల్యే నిరాధారమైన ఆరోపణలు చేయడం బాహ్యం కాదని వైయస్సార్ పార్టీ నాయకులపై ఆయన కార్యాలయంలో తీవ్రంగా విరుచుకుపడ్డారు అలాగే చిత్తూరు అభివృద్ధిని చూసి ఓర్వలేనితనముతో మా నాయకుని పై ఇలాంటి ఆరోపణలు చేయడం తగదని ఆయన పత్రిక ముఖంగా ఆరోపించాడు



# తెలంగాణకు రండి..పెట్టుబడులు పెట్టండి..

హైదరాబాద్: వివిధ రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ సురక్షిత స్థానమని, తెలంగాణకు వచ్చి పెట్టుబడులు పెట్టాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఉత్తర భారత ప్రతినిధులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం పెట్టుబడులకు రక్షణగా నిలుస్తుందని సీఎం హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో సీఐఐ ఉత్తర భారత ప్రతినిధులు శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్ పార్టీ 140 ఏళ్లుగా విజయవంతంగా కొనసాగుతున్నట్లే, సీఐఐ కూడా 130 ఏళ్ల నుంచి విజయవంతంగా కొనసాగుతోందన్నారు. తెలంగాణ బిడ్డ పి.వి.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు తీసుకువచ్చిన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పీజీ+) ఫలితాలను ఇప్పుడు మనం అనుభవిస్తున్నామని సీఎం అన్నారు. ప్రభుత్వాలు మారినా తెలంగాణలో పారిశ్రామిక విధానాలను మార్చడం లేదని సీఎం అన్నారు. 1994 నుంచి 2004 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు అనేక పెట్టుబడులను ఆకర్షించారని, బిల్ గేట్స్, బిల్ క్లింటన్ లాంటి దిగ్గజాలను హైదరాబాద్ కు తీసుకువచ్చారని సీఎం గుర్తు చేశారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పాలనలో అంతర్జాతీయ ఎయిర్ పోర్టు, అవుటర్ రింగ్ రోడ్డు, ఫార్మా, ఐటీ కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చాయన్నారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ పాలనలో వాళ్లు కొన్ని పాలసీలు తీసుకువచ్చారని, వాటిని కొనసాగిస్తూనే తాము సరికొత్త పాలసీలు తీసుకువచ్చామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ లేదని, నాయకులు ఎవరైనా, పార్టీ ఏదైనా మంచి పాలసీ తీసుకువస్తే అది కొనసాగుతోందన్నారు. తాము తీసుకువచ్చిన పారిశ్రామిక విధానాలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని, మంచి ప్రతిపాదనలతో వచ్చిన వారికి ప్రోత్సాహకాలు ఇస్తున్నామని సీఎం తెలిపారు.

ఫార్చ్యూన్ 500 కంపెనీలు భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టాలనేది తమ ఆకాంక్ష అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీలో గత డిసెంబర్ లో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటు చేశామని, సమ్మిట్లో 175 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారని సీఎం వివరించారు. తెలంగాణ రైజింగ్ -2047 పాలసీని గ్లోబల్ సమ్మిట్ లో ప్రకటించామని సీఎం తెలిపారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా అయిదు శాతంగా ఉందని, అది10 శాతంగా ఉండాలన్నదే తన లక్ష్యమని సీఎం వెల్లడించారు.

కాలుష్యంతో ఢిల్లీ, వర్షాలతో ముంబయి, ట్రాఫిక్ కష్టాలతో బెంగళూరు, ప్రకృతి వైపరీత్యాలతో చెన్నై సతమవుతున్నాయని, ఈ నేపథ్యంలో భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించామని సీఎం తెలిపారు. 160 కి.మీ. పొడవైన ఔటర్ రింగు రోడ్డు లోపల ప్రాంతాన్ని క్యూర్‌గా గుర్తించామని, ఇక్కడ సర్వీస్ సెక్టార్‌కు పెద్ద పీట వేస్తున్నామని సీఎం తెలిపారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు ప్రాంతాన్ని ప్యూర్‌గా గుర్తించామని, అక్కడ మాన్యుఫ్యాక్చర్ రంగానికి ప్రాధాన్యమిస్తున్నామని సీఎం తెలిపారు. రీజినల్ రింగు రోడ్డు వెలుపల వ్యవసాయ రంగానికి, అగ్రి పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సీఎం వివరించారు.

ప్యూర్, రేర్ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు ఇవ్వడంతో పాటు ఇతర వసతులు కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీ పట్నం పోర్టు వరకు 12 లేన్ల రహదారి నిర్మించనున్నామని, విభాగాల వారీగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని సీఎం వివరించారు. వరంగల్, ఆదిలాబాద్ లో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు కేంద్రం నుంచి అనుమతి తెలిపిందని, 7 బుల్లెట్ ట్రైన్ల ను కేంద్రం ప్రకటిస్తే 3 తెలంగాణకు వచ్చాయన్నారు. శంషాబాద్ నుంచి చెన్నై, శంషాబాద్ నుంచి పూణె, శంషాబాద్ నుంచి బెంగళూరు బుల్లెట్ ట్రైన్లు రాబోతున్నాయన్నారు. పొరుగు రాష్ట్రాలతో పోటీ పడదల్చుకోలేదని, ప్రపంచంలోని ఇతర దేశాలతో పోటీ పడి చైనా + 1 కంట్రీగా తెలంగాణను నిలపడమే తన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2037 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారు.

తెలంగాణ సంస్కృతి తమకు పెద్ద ఆస్తి అని, హైదరాబాద్‌లో అన్ని రాష్ట్రాల ప్రజలున్నారని సీఎం తెలిపారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టిన దానికి రెట్టింపు ఆదాయం వస్తుందని సీఎం అన్నారు. పారిశ్రామికవేత్తలు తమకు ఏం కావాలో చెబితే ఆ వసతులు కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిత్యం అందుబాటులో ఉంటారని, పరిశ్రమల శాఖ మంత్రి ప్రతి రెండు నెలలకోసారి, తాను ప్రతి మూడు నెలలకు ఒకసారి అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తామని సీఎం తెలిపారు. తెలంగాణను మీ సొంత ప్రాంతంగా భావించాలని సీఐఐ ప్రతినిధులకు సీఎం సూచించారు.

ఏఐ సునామీతో వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయని, దాంతో తాము నైపుణ్యాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పబ్లిక్,ప్రైవేట్ భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నెలకొల్పామని, దానికి ఛైర్మన్ గా ఆనంద్ మహీంద్రా, డైరెక్టర్లుగా కార్పొరేట్ కంపెనీల దిగ్గజాలు ఉన్నారని సీఎం తెలిపారు. దేశంలోనే తమది బెస్ట్ స్కిల్ యూనివర్సిటీ అని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ఐటీఐలను ఏటీసీలుగా మార్చుతున్నామని, అందులో శిక్షణ పొందిన వారికి 100 శాతం ఉద్యోగాలు వచ్చాయని సీఎం తెలిపారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులనే బోధిస్తున్నామన్నారు. ఇక్కడి జీసీసీ ల్లో 200 కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయని, అమెజాన్ డేటా సెంటర్ల పైన రూ.లక్ష కోట్ల పెట్టుబడి పెడుతోందని, అదాని రూ.35 వేల కోట్లు డేటా సెంటర్ పైన పెట్టుబడి పెడుతోందని సీఎం తెలిపారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు రామకృష్ణారావు, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, సీఐఐ నార్తరన్ రీజియన్ వైస్ ఛైర్మన్ శారదా సూరి మార్వా, ప్రతినిధులు కృష్ణ బోధనపు, గౌరవ్ మహేశ్వరి, వనిత దాట్ల, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వినోద్ కె బాప్న తదితరులు పాల్గొన్నారు.

– తెలంగాణ పారిశ్రామిక విధానాలకు ఆకర్షితులమయ్యాం..: పునీత్ కౌరా, ఛైర్మన్, సీఐఐ నార్తరన్ రీజియన్

తెలంగాణ పారిశ్రామిక విధానాలు చాలా బాగున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు, ఇస్తున్న మద్దతుతో జీసీసీలు హైదరాబాద్‌కు వరుస కడుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఇక్కడ ఉంది. మౌలిక వసతులు, ప్రభుత్వ సహాయ సహకారాలు మెరుగ్గా ఉండడంతోనే సమావేశానికి హైదరాబాద్‌ను ఎంచుకున్నాం. ఇక్కడ అధ్యయనం చేసేందుకు వచ్చాం...



## పట్నం కుటుంబాన్ని పరామర్శించిన టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎండి సలీం పాషా

షాబాద్,జూలై 31(విజన్ ఆంధ్ర) : తెలంగాణ శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి తల్లి పట్నం రుక్మమ్మ ఇటీవల పరమపదించిన నేపథ్యంలో,టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎండి సలీం శుక్రవారం పట్నం కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి, పట్నం అవినాష్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డిని కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రుక్మమ్మ చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షాబాద్ మండల విలేఖరుల సంఘం అధ్యక్షుడు దర్పల్లి రవీందర్ గౌడ్, మాజీ అధ్యక్షుడు రాంచంద్రయ్య, రమేష్ యాదవ్ , లక్ష్మణ్, సుధాకర్ రవీందర్, నర్సింలు, అనిల్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## భీంరావు పాటిల్ కి కాంగ్రెస్ నాయకత్వం సన్మానం

బోథ్. జూలై 31. (విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి భీంరావు పాటిల్ కి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాలకు సమన్వయం చేసుకోవాలని, పార్టీ కోసం పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్, ఉమ్మడి జిల్లా సర్ పరిశీలకులు మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, మాజీ ఎంపీ సోయం .బాపురావు , అదిలాబాద్ డిసిసి అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్, బోథ్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆడే .గజేందర్, జిల్లా అధికార ప్రతినిధి పసుల. చంటి, జిల్లా పరిశీలకులు శ్రీధర్, డిసిసి కార్యదర్శి లోలపు పోశెట్టి, ఆత్మ చైర్మన్ రాజు యాదవ్ ,బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి అదిలాబాద్ జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుడాల అనిష్, కాంగ్రెస్ పార్టీ బోథ్, సోనాల మండల అధ్యక్షుడు మెరుగు భోజన్న, గాజుల పోతన్న, జిల్లా నాయకులు ఉమేష్, ఎస్సి విభాగం బోథ్ అధ్యక్షుడు ఆశన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మునేశ్వర్ సోమన్న, జుంగల భోజన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా నాగు ముదిరాజ్ నియామకం

గజ్వేల్, 31 జూలై 2026 (విజన్ ఆంధ్ర) : భారతీయ జనతా పార్టీ (బిజెపి) సిద్దిపేట జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా మామిండ్ల నాగు ముదిరాజ్ నియమితులయ్యారు. తనపై నమ్మకంతో ఇంతటి కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్టానానికి, నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా బిజెపి రాష్ట్ర నాయకులు రామచంద్ర రావు, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లన్నగారి భిక్షపతి, నియోజకవర్గంలోని ప్రతి మండల పార్టీ అధ్యక్షులకు, సీనియర్ నాయకులకు, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్, తోటి కార్యకర్తలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మామిండ్ల నాగు ముదిరాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా ఇంత పెద్ద బాధ్యతను అప్పగించినందుకు శ్రేణు లందరికీ రుణపడి ఉంటానన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. అందరినీ కలుపుకొని పోతూ, నిరంతర శ్రమ, పట్టుదలతో సిద్దిపేట జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

# కిసాన్ నగర్ పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

### హేచ్. ఐ. వి., సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం



బాల్కొండ (నిజామాబాదు జిల్లా) విజన్ ఆంధ్ర జూలై 31 : వర్ష కాలం దృశ్య సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా వైద్యాధికారి డా. రాజశ్రీ శుక్రవారం కిసాన్ నగర్ పీహెచ్ సీ సెంటర్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఆసుపత్రిలోని ఓ. పి , ఫార్మసీ, ల్యాబ్ హేచ్. ఐ. వి వ్యాక్సినేషన్ సెంటర్లను డీఎంహెచ్ఓ పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల నిల్వ, పరీక్షల వివరాలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షాకాలంలో విరేచనాలు, దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు పెరిగే అవకాశం ఉంది. ఓ. పీ.కి వచ్చే ప్రతి జ్వరం కేసును పూర్తిగా పరీక్షించి, అవసరమైన రక్త పరీక్షలు చేయాలని సూచించారు టీబీ లక్షణాలు ఉన్న రోగులను గుర్తించి వెంటనే కఫం పరీక్షలు చేయించాలి. టీబీ రోగులకు నిరంతరం ఫాలోఅప్ చేసి మందులు సక్రమంగా ఇప్పించాలని ఆదేశించారు. 14 సంవత్సరాల బాలికలకు హ్చ్ప్వ్ వ్యాక్సినేషన్‌ను 100% లక్ష్యంగా పూర్తి చేయాలి. పాఠశాలలు, అంగన్‌వాడీలతో సమన్వయం చేసుకుని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఫార్మసీలో అన్ని రకాల అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి. గడువు ముగిసిన మందులు ఉండకూడదు. ల్యాబ్‌లో పరీక్షల రిపోర్టులు త్వరగా ఇవ్వాలని, నాణ్యత పాటించాలని సూచించారు. ఆసుపత్రి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. శుభ్రత పాటించి, క్లీనింగ్ పనులను క్రమం తప్పకుండా చేయాలని సిబ్బందికి సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమని, అందులో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీల్లో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజీవ్ గృహకల్ప ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వ నిధులు కోరిన కమిటీ

- కొలన్ హన్మంత్ రెడ్డికి వినతిపత్రం.. నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ
- శ్రీ ఉమామహేశ్వర స్వామి, శ్రీ నల్ల పోచమ్మ దేవస్థానాల అభివృద్ధికి ప్రత్యేక నిధుల విజ్ఞప్తి
- బాచుపల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జితో ఆలయ కమిటీ భేటీ
- ఆలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్న కొలన్ హన్మంత్ రెడ్డి
- రాజీవ్ గృహకల్ప బోనాల మహోత్సవాలకు ఆహ్వాన పత్రిక అందజేత



నిజాంపేట్, జూలై 31 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో ఉన్న శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ నల్ల పోచమ్మ దేవస్థానం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు శనివారం బాచుపల్లిలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, రాజీవ్ గృహకల్పలోని రెండు దేవాలయాల అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరు అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆలయాల అభివృద్ధి ద్వారా భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం రాజీవ్ గృహకల్పలో నిర్వహించనున్న బోనాల మహోత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేయాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు కొలన్ హన్మంత్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ప్రెసిడెంట్ పితాని శ్రీనివాస్ రావు, టెంపుల్ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, కుమార్ రెడ్డి, రాంచందర్ నాయక్, రమణ, ప్రభాకర్ రెడ్డి, కూరగాయల శివ, వారికుప్పల దశరథ్, తోట బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# నాయకపుగూడలో డ్రై డే, ఉచిత వైద్య శిబిరం

### - మలేరియా, డెంగ్యూ నివారణపై ప్రజలకు అవగా హన



జన్నారం, జులై 30 (విజన్ ఆంధ్ర) : నాయకపు గూడలో వైద్యాధికారులు ఉచిత వైద్య శిబిరం ఏ ర్పాటు చేసి డ్రై డే నిర్వహించారు. జిల్లా వైద్య ఆ రోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు వైద్య బృందం శుక్రవారం రోజున జన్నారం మండలంలోని ఇంద నపల్లి గ్రామ పరిధికి చెందిన నాయకపుగూడలో డ్రై డే కార్యక్రమంతో పాటు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉ చితంగా పంపిణీ చేశారు. మలేరియా, డెంగ్యూ వం టి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉం చుకోవాలని, పగిలిన ప్లాస్టిక్ డబ్బాలు, కొబ్బరి చి ప్పలు, అనవసర పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా తొలగించాలని సూచించారు. దోమల వ్యాప్తిని అరి కట్టేందుకు ప్రతి కుటుంబం పరిశుభ్రతకు ప్రాధాన్య త ఇవ్వాలని వారానికి ఒకరోజు డ్రై డే పాటించ డం ద్వారా వ్యాధులను నివారించవచ్చని వివరిం చారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జి. ల క్ష్మి, హెల్త్ అసిస్టెంట్ టేకుమట్ల పోచయ్య, కె. వసం త, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంపీయూపీఎస్ పులిగిల్లలో "ప్లాస్టిక్ భూతం" అవగాహన స్కిట్



వరంగల్ జిల్లా పరకాల నియోజవర్గం : నడికూడ మండలం ఎంపీయూపీఎస్ పులిగిల్ల పాఠశాలలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే పర్యావరణ, ఆరోగ్య సమస్యలపై విద్యార్థులతో "ప్లాస్టిక్ భూతం" పేరుతో వినూత్న అవగాహన స్కిట్ నిర్వహించారు. ఈ స్కిట్‌లో ప్లాస్టిక్ భూతం వేషధారణ ద్వారా ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వల్ల మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి, పశుపక్ష్యాదులకు కలిగే నష్టాలను విద్యార్థులు చక్కగా ప్రదర్శించి గ్రామ ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ పుల్యాల సంపత్ రెడ్డి మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి గుడ్డ సంచులు, కాగిత సంచులు వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని, పరిశుభ్రమైన పాఠశాల--పరిశుభ్రమైన గ్రామ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. సీనియర్ ఉపాధ్యాయులు శ్రీ కటుకోజ్వల సతీష్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వల్ల మానవ ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావాలు ఏర్పడతాయని, మైక్రోప్లాస్టిక్స్ ద్వారా అనేక దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని వివరించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి "ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టి -- ప్లాస్టిక్ రహిత గ్రామాన్ని నిర్మిద్దాం" అనే సందేశాన్ని అందించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేష్, సరూపరాణి మరియు విద్యా వాలంటీర్ నిరోషా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల "ప్లాస్టిక్ భూతం" ప్రదర్శన గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమం చివరలో "ప్లాస్టిక్‌కు నో చెప్పండి -- ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడండి" అనే సందేశాన్ని అందించారు.

# పాల సంద్రంలా బొగత జలపాతం



వాజేడు,జూలై31(విజన్ ఆంధ్ర) తెలంగాణ నయాగరాగా పిలవబడే "బొగత జలపాతం" వాజేడు మండలం, చీకుపల్లి అడవి ప్రాంతంలో ఉంది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువ ప్రాంతం నుండి భారీగా వరద నీరు చేరడంతో నింగి నుండి నేలకు జాలువారుతున్న "పాల సంద్రంలా" బొగత జలపాతం కనిపిస్తుంది. ఈ అందాలు పర్యటకులను ఆకర్షితులను చేస్తున్నప్పటికీ నో ఎంట్రీ తో వెను తిరుగుతున్నారు. భారీ వర్షాలకు బొగత జలపాతం లోకి ప్రమాద స్థాయిలో నీరు చేరడంతో నీటి ప్రవాహంతో హోరెత్తుతోంది. నీటి ఉధృతి ఏ స్థాయిలో ఉందంటే చాలా దూరంలో ఉన్న వారికి కూడా ఆ శబ్దం ఎంతో స్పష్టంగా వినిపిస్తుంది. అయితే పర్యాటకుల భద్రత దృష్టిలో ఉంచుకొని బొగత సందర్శనను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు

# గోదావరి వరదల్లో సిఐ రాజు వర్మ, ఎస్ ఐ నర్సిరెడ్డి సాహస యాత్ర



**తహసిల్దార్ బృందం 15 మంది రక్షించగా - సిఐ రాజు వర్మ 30 మందిని రక్షించేందుకు స్వయంగా రంగంలోకి.**

చర్ల , (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా): మండలంలోని వీరాపురం గోదావరి ఇసుక ర్యాంపు వద్ద అకస్మాత్తుగా పెరిగిన వరద ఉధృతితో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇసుక లోడింగ్ పనుల్లో ఉన్న కార్మికులు మధ్యలో చిక్కుకోవడంతో తీవ్ర భయాందోళనలు తలెత్తాయి. సమాచారం అందిన వెంటనే స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఈదయ్య, ఎస్ఐ నర్సిరెడ్డిలతో కలిసి సీఐ రాజు వర్మ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా లైఫ్ జాకెట్లతో మొదటి విడతలో 15 మంది కార్మికులను సురక్షితంగా తహసిల్దార్ కార్యాలయ బృందం సహాయంతో రక్షించారు

అంతటితో ఆగకుండా, అవతల లంక ప్రాంతంలో చిక్కుకున్న మరో ముప్పై మందికి పైగా లారీ డ్రైవర్లు, పశువుల కాపర్లను రక్షించేందుకు సిఐ రాజు వర్మ తెప్పపై సాహస యాత్ర చేశారు, వరద తీవ్రతకు సిఐ రాజు వర్మ ఎక్కిన తెప్ప కొంతమేరా కొట్టుకుపోయినా చాకచక్యంగా వ్యవహరించి లంకలోకి చేరుకుని సిఐ రాజు వర్మ , ఎస్ ఐ నర్సిరెడ్డి లు అందరికి ధైర్యం ఇవతలి ఒడ్డు కు వెళ్లాలని హితవు చేశారు, అధికారుల సమన్వయం, పోలీసుల తెగువతో పెను ప్రమాదం తప్పింది

ఈ ఏడాది వరదలు మునుపటి కంటే ఉధృతంగా ఉండే అవకాశం ఉన్నందున, ఇసుక ర్యాంపుల్లోని గోతుల వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, ఈ నేపథ్యంలో ఎవరూ ఈతకు, చేపల వేటకు వెళ్లవద్దని, ప్రయాణ సమయాల్లో విధిగా లైఫ్ జాకెట్లు ధరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట హెచ్చరిస్తున్నారు.

# కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన ఎంపీ నగేష్

బోథ్. జూలై 31. (విజన్ ఆంధ్ర) : కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చవాన్ ను ఢిల్లీ లోని తన కార్యాలయంలో ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి దృష్టికి ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకాన్ని షెడ్యూల్డ్ గ్రామం కాకున్నా 100 శాతం గిరిజనులు ఉండి 250 జనాభా కలిగిన గ్రామాలకు వర్తింప చేయాలని విన్నవించారు. ఈ విషయాన్ని మంత్రి సానుకూలంగా స్పందించారని అన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల కోసం కేంద్ర మంత్రులతో సంప్రదింపులు నిరంతరం కొనసాగిస్తానని ఎంపీ నగేష్ ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో నగేష్ తో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులు, డీ.కే అరుణ, ఈటల రాజేందర్, రఘునందన్ రావ్, కొండ విశ్వేశ్వర్ రెడ్డి లు కలరు.

# గౌరవెల్లి ప్రాజెక్టు ఆపడానికి కేసు వేసింది మీరే, సంబరాలు చేసుకునేది మీరే

## - కాంగ్రెస్ పై బిఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ గద్దల రమేష్ ధ్వజం

అక్కన్నపేట విజన్ ఆంధ్ర జులై 31 : గౌరవెల్లి ప్రాజెక్టు విషయంలో పటాకులు పేల్చి సంబరాలు చేసుకోవడం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బిఆర్ఎస్ నాయకులు చౌటపల్లి గ్రామ మాజీ సర్పంచ్ గద్దల రమేష్ హాస్యాస్పదమని అన్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టు ఆపడానికి కేసు వేయించింది కాంగ్రెస్ వారే , సుప్రీం కోర్టు ఆదేశాలతో పటాకులు పేల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకుంటున్నది కాంగ్రెస్ వారేనన్నారు.హుస్నాబాద్ ప్రాంత వరదాయిని గౌరవెల్లి ప్రాజెక్టు గత ప్రభుత్వం హయాంలో మాజీ శాసనసభ్యులు వొడితెల సతీష్ కుమార్ హుస్నాబాద్ మెట్ట ప్రాంత ప్రజలకు సాగు నీరు అందించాలనే సంకల్పంతో 1.4టీఎంసీ గా ఉన్న ప్రాజెక్టుని 8.23 టీఎంసీల కెపాసిటీ పెంచి 95శాతం పనులు పూర్తి చేయించి తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ తో ప్రారంబానికి సిద్ధం చేసిన సమయంలో ఇప్పటి మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర మంత్రి బండి సంజయ్ లు కలిసి ఆనాడు గుడాటిపల్లి కాంగ్రెస్ నాయకులతో చెన్నై లొ ఉన్న ఎన్జీటిలొ కేసు వేయించి ప్రాజెక్టు ప్రారంభం కాకుండా అడ్డుకున్నారన్నారు.కేసు వేయించిన విధానం ఈ ప్రాజెక్టు వల్ల ఆ ప్రాంతంలో ఉన్న అడవి జంతువులు పులులు, చిరుతలు, కొండచిలువలు,జింకలు,అడవి నక్కలు ఇంక చాల జంతువులు చనిపో యా యి, బ తి కు న్న జంతువులు గ్రామాల్లోకి వస్తున్నాయని ప్రజల జీవనం ఇ బ్బం ది క రం గా మా రు తుం ద ని గుర్తిస్తు న్నా ర ని లేని జంతువులను పేపర్లలో సృష్టించి కేసు వేశారన్నారు.



గౌరవెల్లి ప్రాజెక్టు విషయంలో అప్పటి ప్రభుత్వం విధానాలు కరెక్టుగానే ఉంది లేకుంటే ఈ రోజు సుప్రీం కోర్టు అవకాశం ఇచ్చేది కాదు కదా అన్నారు.కావాలనే క్రియేట్ చేసి ప్రాజెక్టు ప్రారంభం ఇంత ఆలస్యం చేయించింది కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ , మరి ఈ రోజు ఎం సాధించారని పటాకులు పేల్చడం స్వీట్ల పంపిణీ చేయడం,మీ కుటిల కుయుక్తులతో చేసిన పనికి హుస్నాబాద్ ప్రాంత ప్రజలకు కాంగ్రెస్ నాయకులు క్షమాపణ చెప్పాలి కానీ సంబరాలు చేయవద్దన్నారు.ఎందుకంటే మీరు సాధించింది ఎం లేదని మీ తాతంగాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాబోయే రోజులలో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పడానికి రైతంగం సిద్ధంగా ఉన్నారన్నారు.

# కార్మికులకు వేతనాలు పెంచాలి

చిత్తూరు జూలై 31 విజన్ ఆంధ్ర ప్రతినిధి రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది కార్మికులకు వేతనాలు పెంచాలని ఈరోజు చిత్తూరు కలెక్టరేట్ నందు జిల్లానుమూలన వచ్చిన కార్మికులు ధర్నా నిర్వహించారు ఈ ధర్నా కార్యక్రమంలో 20 11 సంవత్సరంలో పెంచారని అలాగే 2026 వరకు వేతనాల పెంచకుండా ప్రైవేటు విద్యాసంస్థలు వేలకోట్ల రూపాయలను లాభాలు అర్జిస్తూ కార్మికులకు మాత్రం చేస్తున్నారని ప్రైవేట్ విద్యాసంస్థల కు వేలకోట్ల రూపాయలు లాభాలు కట్టబెడుతూ ప్రభుత్వాలు వారికి వత్తాసు పలుకుతున్నాయని 20 11 జీవో ప్రకారం ప్రాంతాన్ని బట్టి ఆయా అటెండర్లకు నెలకు 12,000 నుండి 1240 వేతనాలు చెల్లించాలని అలాగే ల్యాబ్ టెక్నిషీ అసిస్టెంట్లకు లైబ్రరీలకు ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని పెరిగిన నిత్యవసర వస్తువుల ప్రకారం యాజమాన్యాలపై ఒత్తిడి తెచ్చి వీరికి వేతనాలు అందించాలని సిఐటియు నాయకులు ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు ఈ ధర్నాలో అంగనవాడి ఆయాలు ఆశా వర్కర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు





## 20 వ నిర్మాణాత్మక సమీక్ష సమావేశం

మందమర్రి, జూలై 31 (విజన్ ఆంధ్ర) : సింగరేణి కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా, సమస్యల పరిష్కారం కొరకై గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియూసితో 20 వ నిర్మాణాత్మక సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించినట్లు ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం జిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఉత్పత్తితో పాటు కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యత,ఉత్పత్తి ఉత్పాదక సాధనలోనూ కార్మిక సంఘాల పాత్ర అత్యంత కీలకమన్నారు. గత సమావేశంలో చర్చించిన అంశాల పురోగతిపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఆపరేటర్లకు అవసరమైన పనిముట్లను, రెయిన్ కోట్లను ఇవ్వనున్నారు, మహిళా ఎస్ అండ్ పి సి సెక్యూరిటీ గార్డులకు కనీస సౌకర్యాలు కల్పించనున్నారు.అలాగే ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సమావేశంలో అధికారులు,యూనియన్ నేతలు పాల్గొన్నారు.


## గజ్వేల్‌లో ఘనంగా 'ప్రపంచ రేంజర్ల దినోత్సవం'



గజ్వేల్, 31 జూలై 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయంలో 'ప్రపంచ రేంజర్ల దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వినాయక్ హాజరుకాగా, ఫారెస్ట్ అధికారి పవన్ కుమార్ మరియు ఇతర అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమర రేంజర్లు మరియు అటవీ సిబ్బంది త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎఫ్.ఆర్.ఓ వినాయక్ మాట్లాడుతూ ప్రాణాలకు తెగించి అడవులు, అమూల్యమైన వన్యప్రాణులను కాపాడటంలో ఫారెస్ట్ రేంజర్లు, ఫీల్డ్ సిబ్బంది పోషిస్తున్న పాత్ర అత్యంత కీలకమైనదని కొనియాడారు. క్లిష్ట పరిస్థితుల్లో కూడా విధి నిర్వహణలో ప్రదర్శిస్తున్న నిబద్ధత అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి ప్రతి ఒక్కరు చెట్లను నాటి సంరక్షించాలని, అటవీ సంపద మరియు వన్యప్రాణుల రక్షణలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని తెలిపారు. ఈ వేడుకల్లో అటవీ శాఖకు చెందిన సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్, అటవీ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం...

బోధన్, జూలై 31(విజన్ ఆంధ్ర) : బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని అచన్ పల్లి, వినాయక్ నగర్ సమీపంలో ఉన్న ఒక నీటి గుంటలో సుమారు 55 నుండి 60 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. మృతుడు గులాబీ రంగు టీ-షర్ట్, గులాబీ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, మృతుడు అనారోగ్యం కారణంగా గానీ లేదా మద్యం మత్తులో జారిపడి బురద నీటిలో మునిగి, కంటికి గాయమై మృతి చెంది ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నామన్నారు. గుర్తు తెలియని మృతదేహం గా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. చుట్టుపక్కల విచారించగా మృతుడి వివరాలు లభ్యం కాలేదన్నారు. కావున మృతుడి ఆచూకీ లేదా వివరాలు తెలిసిన వారు వెంటనే బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ లో కానీ, లేదా 8712659870, 8712659778 నెంబర్ లను సంప్రదించాలని సూచించారు.



# మల్కాపూర్ అక్రమ వెంచర్‌కు ఎవరి అండ..?

**- నిబంధనలకు తూట్లు పొడుస్తూ ప్లాట్ల విక్రయాలు..!**




సంగారెడ్డి బ్యూరో , జూలై: 31(విజన్ ఆంధ్ర ) : సంగారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలోని మల్కాపూర్ గ్రామ పరిధిలో వెలసిన ఓ అక్రమ వెంచర్ చుట్టూ తీవ్ర వివాదాలు నెలకొన్నాయి. డీటీసీపీ , వంటి తప్పనిసరి అనుమతులు లేకుండానే ప్లాట్లను విక్రయిస్తూ అమాయక ప్రజలను మభ్యపెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వెంచర్‌కు సంబంధించిన ప్రచారంలో అన్ని సౌకర్యాలు, భవిష్యత్‌లో భారీ అభివృద్ధి, పెట్టుబడులకు బంగారు అవకాశం అంటూ ఆకర్షణీయమైన ప్రకటనలు ఇస్తున్నప్పటికీ, వాస్తవానికి చట్టబద్ధమైన అనుమతులు లేకపోవడం కొనుగోలుదారులను ఆందోళనకు గురిచేస్తోంది. లక్షల రూపాయలు వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేసిన తర్వాత సమస్యలు ఎదురైతే బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

స్థానికుల సమాచారం ప్రకారం, గత కొంతకాలంగా ఈ వెంచర్‌లో యథేచ్ఛగా ప్లాట్ల విక్రయాలు కొనసాగుతున్నా సంబంధిత శాఖల అధికారులు ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. అధికారులు మౌనం పాటించడం వెనుక ఏదైనా ఒత్తిడి ఉందా? లేక అక్రమాలకు అండదండలు లభిస్తున్నాయా? అనే చర్చ సాగుతోంది.

రెవెన్యూ, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్ శాఖలు సంయుక్తంగా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ లేఅవుట్ల పేరుతో ప్రజల కష్టార్జిత సొమ్ము దోచుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ వ్యవహారంపై సంబంధిత అధికారుల దృష్టికి విషయం వెళ్లడంతో జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) మల్లారెడ్డి స్పందించారు. మల్కాపూర్ వెంచర్‌పై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలపై సమగ్ర విచారణ నిర్వహించి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వెంచర్‌కు అవసరమైన అనుమతులు, లేఅవుట్ నిబంధనలు, గ్రామ పంచాయతీ అనుమతులు తదితర అంశాలను పరిశీలించి నివేదిక సిద్ధం చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలు చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయో లేదో నిర్ధారించుకున్న తర్వాతే ప్లాట్లు కొనుగోలు చేయాలని సూచించారు.

అధికారుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తే అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని డీపీవో మల్లారెడ్డి స్పష్టం చేశారు. స్థానికులు కూడా ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# శిథిలావస్థలో గాదిగూడ ప్రభుత్వ ఆశ్రమ బాలుర పాఠశాల

- పాఠశాల తరగతి గదులను పరిశీలించిన సర్పంచ్
- పెచ్చులూడుతున్న పాఠశాలల పైకప్పులు
- పాములు తిరుగుతున్న వైనం
- భయాందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు,



గాదిగూడ,జులై 31(విజన్ ఆంధ్ర): ప్రభుత్వం పాఠశాలల భవనాలతో పాటు విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తోంది.ప్రతీ యేటా విద్యా సంవత్సరం ఆరంభంలో ఆయా పాఠశాలల భవనాల మరమ్మతులకు, ఇతరత్రా పనుల నిమిత్తం నిధులను విడుదల చేస్తోంది.కానీ విద్యాశాఖ అధికారుల అలసత్వం కారణంగా ప్రభుత్వ ఆశయానికి గండిపడుతోంది.పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాల పైకప్పు పెచ్చులూడుతోంది.వర్షాకాలంలో వర్షపు నీరు స్లాబ్, గోడల నుంచి రావడంతో భవన నిర్మాణం దెబ్బతింటోంది.అక్కడక్కడ సజ్జలు కూడా పెచ్చులూడుతూన్నాయని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఆడ చంద్రకళ రాజు శుక్రవారం పాఠశాల భవన తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చలికాలం,ఎండాకాలం పరిస్థితులు కాస్త మెరుగ్గా ఉన్నా,వర్షాకాలంలో మాత్రం విద్యార్థులు ఇబ్బందులు పడక తప్పడంలేదు.ప్రస్తుతం ఈ పాఠశాలలో 225 మంది విద్యార్థులున్నారు.పాఠశాల భవనం సిథిలావస్థకు చేరడంతో పిల్లలు ఇళ్లలకు వెళ్తున్నారని పాఠశాలకు 150 మంది విద్యార్థులు దిక్కుయ్యారు. చదువుకుందామని పాఠలకు వస్తే తరగతి గదులు అవసరమైన సౌకర్యలు లేవు అని ఉన్నత అధికారుల నిరలక్ష్యం వల్లనే ఆదివాసీ విద్యార్థులు చదువు దూరమవుతున్నారని మండిపడ్డారు.అధికారులు స్పందించి వెంటనే స్పందించి పాఠశాల భవనాలకు మారమ్మతులు చేయాలని కోరారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి జడ్చర్లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘన నివాళి

జడ్చర్ల, జులై 31,(విజన్ ఆంధ్ర): దివంగత నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలను గుర్తు చేసుకుంటూ బీఆర్ఎస్ నాయకులు జడ్చర్లలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి అశ్రునివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సుదర్శన్ రెడ్డి పార్టీ కోసం, ప్రజల కోసం చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ఆయన చూపిన ఆదర్శాలను, సేవా మార్గాన్ని కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమానికి మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కొడ్గల్ యాదయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి, సుదర్శన్ రెడ్డి తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పిట్టల మురళి, రఘుపతి రెడ్డి, ఇమ్ము సుదర్శన్, మాజీ కౌన్సిలర్ కొట్ల ప్రశాంత్ రెడ్డి తో పాటు మహేష్, నరసింహా, కొండల్, కరాటే శ్రీను, గిరి యాదవ్, అమీర్, బీకేఆర్, సాగర్, శ్రీనివాస్ యాదవ్,



సూరి, శాంతు చారి, రాజేందర్ గౌడ్, దర్శన్, గిరి సత్యం, మహమూద్, రాజు, ఇబ్రహీం, షఫీ, శంకర్ సహా పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరై నివాళులు అర్పించారు. చివరగా పెద్ది సుదర్శన్ రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించి, ఆయన ఆశయ సాధనకే తమ జీవితాలు అంకితమని నాయకులు స్పష్టం చేశారు.